@vaartanews @mvnewstv www.mivaartanews.com
TGBIL/25/A0512
# మన వార్త
AP EDITION
విజయవాడ
ప్రతి అక్షరం... ప్రజల కోసం
గురువారం 10 సెప్టెంబర్ 2026
సంపుటి : 2
సంచిక : 260
పేజీలు : 8 వెల : 5/-

వార్త
విలేకరులు కావలెను
ఈ క్రింది నెంబర్లకు వాట్సప్ ద్వారా తమ వివరాలు పంపగలరు
96763 94932

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను
ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్‌లు, నియోజకవర్గాల వారీగా ఆర్‌సీ ఇంచార్జ్‌లు, మండలాల వారీగా విలేకరులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం ఉంటుంది

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



## భారత్, రష్యా రక్షణ ఒప్పందం

- ఈ సారి ఆ మూడింటిపైనే మెయిన్ ఫోకస్?!
- ఎస్ 400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్
- ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్ సుఖోయ్-57 సాంకేతిక బదిలీ
- అత్యంత శక్తివంతమైన బ్రహ్మోస్ క్షిపణి అప్‌గ్రేడేషన్
- ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించే మూడు ప్రధాన అంశాలు




## విమర్శలను న్యాయవ్యవస్థ వ్యతిరేకించదు

- సమాచారం లేని వాదనలను వ్యతిరేకిస్తుంది: సుప్రీంకోర్టు
- ఎన్‌సీఈఆర్‌టీపై కీలక వ్యాఖ్యలు చేసిన దేశ అత్యున్నత న్యాయస్థానం
- విమర్శలను న్యాయవ్యవస్థ వ్యతిరేకించదని వెల్లడి
- అయితే వాటిని సరైన వేదిక ద్వారా నిష్పక్షపాతంగా వ్యక్తం చేయాలని సూచన

# భూముల భద్రతే లక్ష్యం

- వచ్చే మార్చి నాటికి సమస్యలన్నీ పరిష్కరిస్తాం: సీఎం చంద్రబాబు
- గొడ్డలి పార్టీ అధ్యక్షుడి అరాచకాలు..
- తండ్రే భరించలేకపోయారు
- ప్రతీకారం తీర్చుకునేందుకు నిమిషం చాలు... కానీ సహనంతో వ్యవహరిస్తా
- నన్ను ఇబ్బంది పెట్టినట్టే... పవన్ కళ్యాణ్‌నూ వేధించారు
- పి.గన్నవరం సభలో సీఎం చంద్రబాబు



**పి.గన్నవరం**

రాజకీయ కక్షలకు తాను ఎన్నడూ ప్రాధాన్యం ఇవ్వనని... ప్రజల కోసం... రాష్ట్రాభివద్ధి కోసం సహనంతో.. ఓపిగ్గా ఉండడం తనకు అలవాటని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. విలువలతో కూడిన రాజకీయం, పేద ప్రజలకు మెరుగైన జీవితం, తెలుగుజాతి అభివద్ధి కోసం తాను నిరంతరం ఆలోచిస్తానని స్పష్టం చేశారు. మీ భూమి--మీ హక్కు కార్యక్రమంలో భాగంగా బుధవారం కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గం పందువారిపేటలో నిర్వహించిన సభలో ప్రసంగించారు. దీంట్లో భాగంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి అచ్చెన్నాయుడు కొన్ని కీలకాంశాలను ప్రస్తావించారు. - మిగతా3లో



## స్థానిక ఎన్నికల్లో గట్టిగా నిలబడాలి

- దౌర్జన్యాలతో పాలకులు ఎప్పటికీ రాజ్యం చేయలేరు
- వైయస్‌ఆర్‌సీపీ జెండా ఎగరాలి
- నాయకులు, కార్యకర్తల సమావేశంలో వైసీపీ అధినేత జగన్
- పర్చూరు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలకు వైయస్ జగన్

**తాడేపల్లి**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైయస్‌ఆర్‌సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు గట్టిగా నిలబడి పోరాడాలని వైయస్‌ఆర్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బాపట్ల జిల్లా పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన వైయస్‌ఆర్‌సీపీ స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, నాయకులు, ముఖ్య కార్యకర్తలతో తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పర్చూరు నియోజకవర్గ పరిస్థితులు, - మిగతా3లో

## ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీకి రూ.1,473 కోట్ల విరాళాలు

- కాంగ్రెస్ కంటే 7 రెట్లు ఎక్కువ
- ఐదు రాష్ట్రాల ఎన్నికల సమయంలో బీజేపీకి రూ.1,472.8 కోట్ల నిధులు
- కాంగ్రెస్ మొత్తం రూ.207.17 కోట్లు
- ఈసీకి సమర్పించిన ఖర్చుల వివరాల్లో వెల్లడి



## విజయ్ నాయకత్వంలో కొత్త కూటమి

- సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్
- రెండో కూటమి సమన్వయ సమావేశంలో నిర్ణయం
- ఈ పేరే తమ కూటమి సిద్ధాంతాలను, అజెండాను తెలియజేస్తోందన్న తమిళనాడు వీసీసీ అధ్యక్షుడు



## భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు రవాణా సౌకర్యాలేంటి?



- అఫిడవిట్ వేయాలని హైకోర్టు ఆదేశం
- అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి రవాణా సదుపాయాలపై న్యాయస్థానం ఆరా
- అన్ని అంశాల గురించి వివరాలు సమర్పించాలని ఆదేశాలు
- సమగ్ర వివరాలు కోరిన హైకోర్టు

**అమరావతి**

విజయనగరం జిల్లా భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి రవాణా సదుపాయాలపై హైకోర్టు స్పందించింది. విశాఖపట్నం నగరం నుంచి ఈ కొత్త విమానాశ్రయానికి ప్రజా రవాణా (కనెక్టివిటీ) సరిగ్గా లేకపోవడం వల్ల ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన కోర్టు, పూర్తి వివరాలు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇందులో భాగంగా విమానాశ్రయం చేరుకునేందుకు - మిగతా3లో

# ప్రభుత్వ పథకాల అర్హులను ఇట్టే గుర్తించొచ్చు



- ఐఐటీ కాన్పూర్ ఏఐ 'ఫ్యామిలీ స్కోర్'
- ప్రభుత్వ పథకాలకు అర్హులను గుర్తించేందుకు ఏఐ ఆధారిత వ్యవస్థను అభివృద్ధి చేసిన ఐఐటీ కాన్పూర్
- సమయంతో పాటు డబ్బు ఆదా
- ఏపీ ప్రభుత్వంతో ఐఐటీ కాన్పూర్ సహకార ఒప్పందం

**అమరావతి**

ఇప్పటికే ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న డేటాను ఉపయోగించి, సంక్షేమ పథకాలకు అర్హులయ్యే కుటుంబాలను గుర్తించే ఫ్యామిలీ స్కోర్ అనే ఏఐ ఆధారిత వ్యవస్థను ఐఐటీ కాన్పూర్ అభివృద్ధి చేసింది. దీని ద్వారా ఇంటింటికీ సర్వేల అవసరం లేకుండానే ఓ కుటుంబానికి సంబంధించిన సామాజిక ఆర్థికస్థితిని అంచనా వేయడానికి వీలు కలుగుతుంది. తద్వారా తక్కువ ఖర్చుతో పాటు తక్కువ సమయంలోనే అర్హులైన కుటుంబాలను గుర్తించడం సాధ్యమవుతుంది. అంటే ఏ కుటుంబాలకు ప్రభుత్వ సహాయం అవసరమో 'ఫ్యామిలీ స్కోర్' ద్వారా తెలుసుకోవచ్చు. ఈ మేరకు ఐఐటీ కాన్పూర్, ఏపీ ప్రభుత్వం మధ్య ఓ సహకార ఒప్పందం జరిగింది. ఇందులో భాగంగా కుటుంబాల సామాజిక ఆర్థికస్థితిని ఏఐ అంచనా వేయగలదా? లేదంటే సాధారణంగా చేపట్టే ఇంటింటి సర్వేలను భర్తీ చేయగలదా? అనే అంశాన్ని ప్రయోగాత్మకంగా తొలి దశలో పరిశీలించారు. ఈ క్రమంలోనే ఇంటింటి సర్వేల కంటే ఐఐటీ కాన్పూర్ అభివృద్ధి చేసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మోడల్ వ్యవస్థ - మిగతా3లో

# ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీకి రూ.1,473 కోట్ల విరాళాలు

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీ భారీగా విరాళాలు వచ్చాయి. కాంగ్రెస్?తో పోలిస్తే భారీగానే వ్యత్యాసం కనిపించింది. బీజేపీ కేంద్ర కార్యాలయానికి మాత్రమే దాదాపు రూ.1,473 కోట్లు నిధులు వచ్చాయి. కానీ కాంగ్రెస్?కు మాత్రం కేంద్ర, రాష్ట్ర విభాగాలన్నింటినీ కలిపి వచ్చిన ఆదాయం రూ.207 కోట్లు మాత్రమే వచ్చింది. అంటే బీజేపీకి వచ్చిన మొత్తం నిధులు కాంగ్రెస్ కంటే ఏడు రేట్లు ఎక్కువగా ఉండటం గమనార్హం. ఇరు పార్టీలు ఎన్నికల సంఘానికి సమర్పించిన నివేదికల్లో ఈ వివరాలు వెల్లడించారు.



**బీజేపీ ఖాతాలో రూ.1,472.8 కోట్లు**

ఈ ఏడాది అసోం, కేరళ, తమిళనాడు, బంగాల్, పుదుచ్చేరి రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. మార్చి 15 నుంచి మే 6 వరకు బీజేపీ కేంద్ర కార్యాలయానికి రూ.1472.8 కోట్లు ఆదాయం వచ్చినట్లు ఈసీకి సమర్పించిన వివరాల్లో వెల్లడైంది. అయితే కేరళ, బంగాల్ ఎన్నికలకు సంబంధించిన బీజేపీ ఖర్చుల నివేదికలు ఇంకా బహిర్గతం కాలేదు. ఆయా రాష్ట్రాల వివారలు కూడా కలిపితే పార్టీ మొత్తం ఆదాయం ఇంకా ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఎన్నికల ప్రారంభంలో మార్చి 15న బీజేపీ కేంద్ర కార్యాలయ ఖాతాల్లో సుమారు రూ.6,722.6 కోట్లు ఉన్నాయి. మే 6 నాటికి ఆ మొత్తం రూ.7,627.2 కోట్లకు చేరింది. అంటే ఎన్నికల వ్యవధిలోనే కేంద్ర కార్యాలయ నిధుల్లో రూ.904.6 కోట్ల పెరుగుదల నమోదైంది.

**కాంగ్రెస్ నిధుల్లో తగ్గుదల**

ఇదిలా ఉండగా, కాంగ్రెస్ మాత్రం ఎన్నికల సమయంలో ఆర్థిక పరిస్థితి భిన్నంగా కనిపించింది. ఐదు రాష్ట్రాల పార్టీ విభాగాలు, కేంద్ర కార్యాలయాన్ని కలిపి ఎన్నికల ప్రారంభంలో సుమారు రూ.169.06 కోట్లు ఉన్నాయి. ఇందులో రూ.22.9 కోట్లు నగదు రూపంలో, రూ.146.1 కోట్లు బ్యాంకు ఖాతాల్లో ఉన్నాయి. ఎన్నికలు ముగిసే సమయానికి ఈ మొత్తం సుమారు రూ.103.2 కోట్లకు తగ్గింది. అంటే ఎన్నికల కాలంలో కాంగ్రెస్ నిధుల్లో దాదాపు రూ.65.86 కోట్ల క్షీణత నమోదైంది.

**బీజేపీ ఖర్చు ఎక్కడెంత?**

ఇప్పటివరకు బహిర్గతమైన బీజేపీ వ్యయ వివరాల ప్రకారం, అసోం, తమిళనాడు, పుదుచ్చేరిల్లో సుమారు రూ.159.7 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో రూ.130.4 కోట్లు సాధారణ పార్టీ ప్రచారానికి, మిగిలిన మొత్తం అభ్యర్థులు, ఇతర సంబంధిత ఖర్చుల కోసం వినియోగించింది. అసోంలో బీజేపీ అత్యధికంగా రూ.96.27 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో రూ.76.73 కోట్లు పార్టీ సాధారణ ప్రచారానికి, రూ.19.54 కోట్లు అభ్యర్థుల కోసం ఖర్చయ్యాయి. సాధారణ ప్రచార వ్యయంలో ప్రకటనలకు దాదాపు రూ.37 కోట్లు, స్టార్ క్యాంపెయినర్ల ప్రయాణానికి రూ.27.3 కోట్లు ఖర్చయ్యాయి. ఇక తమిళనాడులో బీజేపీ రూ.51.56 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో రూ.44.51 కోట్లు సాధారణ ప్రచారానికి, రూ.7.05 కోట్లు అభ్యర్థుల కోసం వెచ్చించింది. మీడియా ప్రకటనలకు సుమారు రూ.23.96 కోట్లు, స్టార్ క్యాంపెయినర్ల ప్రయాణానికి రూ.10.04 కోట్లు ఖర్చు చేసింది. ప్రచార సామగ్రికి మరో రూ.5.85 కోట్ల వరకు వెచ్చించింది. పుదుచ్చేరిలో బీజేపీ మొత్తం రూ.11.90 కోట్ల ఎన్నికల వ్యయాన్ని చూపించింది. ఇందులో రూ.9.19 కోట్లు సాధారణ ప్రచారానికి, రూ.2.71 కోట్లు అభ్యర్థులకు సంబంధించిన ఖర్చులకు వెళ్లాయి.

**కాంగ్రెస్ ఎన్నికల ఖర్చు రూ.248.55 కోట్లు**

ఇక కాంగ్రెస్ ఐదు రాష్ట్రాల్లో కలిపి రూ.248.55 కోట్లు ఎన్నికల్లో ఖర్చు చేసింది. ఇందులో రూ.143 కోట్లు సాధారణ పార్టీ ప్రచారానికి, రూ.105.55 కోట్లు అభ్యర్థుల కోసం ఖర్చు చేసింది. కాంగ్రెస్ కేంద్ర కార్యాలయం ఐదు రాష్ట్రాల్లో సాధారణ ప్రచారానికి రూ.40.52 కోట్లు ఖర్చు చేయగా, రాష్ట్ర, స్థానిక విభాగాలు మరో రూ.102.49 కోట్లు వెచ్చించాయి. ఈ వ్యయంలో కేరళ అగ్రస్థానంలో నిలిచింది. అక్కడ సాధారణ ప్రచారానికి రూ.59.28 కోట్లు ఖర్చు చేసింది. అసోంలో రూ.22.62 కోట్ల వ్యయం నమోదైంది.

# భారత్, రష్యా రక్షణ ఒప్పందం

భారత్– రష్యా మధ్య ఉన్న వ్యూహాత్మక రక్షణ బంధం మరో సరికొత్త మలుపు తిరగబోతోంది. దిల్లీ వేదికగా జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు నేపథ్యంలో ఈ నెల 11న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య అత్యంత కీలకమైన ద్వైపాక్షిక చర్చలు జరగనున్నాయి. ఈసారి అజెండాలో ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించే మూడు ప్రధాన అంశాలు ఉన్నాయి. అవే ఎస్–400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్, రష్యాకు చెందిన ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్ సుఖోయ్–57 సాంకేతిక బదిలీ, అత్యంత శక్తివంతమైన బ్రహ్మోస్ క్షిపణి అప్‌గ్రేడేషన్. ఈ రక్షణ ఒప్పందాలు కార్యరూపం దాల్చితే ఆసియా ఖండంలో భారత్ రక్షణ ముఖచిత్రం పూర్తిగా మారిపోనుంది.



**ఎస్–400 ట్రయంఫ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ డెలివరీ**

మిలిటరీ–టెక్నికల్ సహకారమే ప్రధాన అజెండాగా ఈ చర్చలు సాగనున్నాయని క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ చేసిన తాజా వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. వీటిలో మొదటి ప్రధాన అంశం. ఎస్–400 ట్రయంఫ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ డెలివరీ. శత్రు దేశాల నుంచి దూసుకొచ్చే విమానాలు, క్రూయిజ్ క్షిపణులు, బాలిస్టిక్ మిస్సైళ్లను గాలిలోనే పసిగట్టి నిర్వీర్యం చేయగల శక్తివంతమైన వ్యవస్థ ఇది. 2018లో రష్యాతో భారత్ 5.43 బిలియన్ డాలర్ల ఒప్పందం కుదుర్చుకుంది. మొత్తం ఐదు వ్యవస్థలను కొనుగోలు చేయగా, ఇప్పటికే మూడు భారత్‌కు చేరాయి. భారత వాయు రక్షణలో కీలకమైన ఈ ఎస్–400 సిస్టమ్స్ తదుపరి రెండు యూనిట్లను 2026 నాటికి పూర్తి స్థాయిలో సరఫరా చేయడానికి కట్టుబడి ఉన్నామని రష్యా తాజాగా ప్రకటించింది. రక్షణ కొనుగోళ్ల మండలి కూడా అదనపు వ్యవస్థల కొనుగోలుకు పచ్చజెండా ఊపిన నేపథ్యంలో ఈ డెలివరీలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది.

**'సుఖోయ్–57' స్టెల్త్ ఫైటర్ జెట్**

ఇక ఈ భేటీలో అత్యంత వ్యూహాత్మకమైన, ఆసక్తికరమైన అంశం, రష్యాకు చెందిన ఐదో తరం 'సుఖోయ్–57' (ఎస్‌యు–57) స్టెల్త్ ఫైటర్ జెట్. శత్రు రాడార్లకు చిక్కకుండా లక్ష్యాలను ఛేదించగల ఈ అధునాతన యుద్ధ విమానాన్ని భారత్‌కు విక్రయించేందుకు రష్యా గట్టి ప్రయత్నాలు చేస్తోంది. అయితే, భారత్ వ్యూహం ఇక్కడ భిన్నంగా ఉంది. 'మేక్ ఇన్ ఇండియా'లో భాగంగా కేవలం కొనుగోలు దారుడిగా మిగిలిపోకుండా, టెక్నాలజీ బదిలీ జరగాలని భారత్ పట్టుబడుతోంది. ఆధునిక రాడార్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సిస్టమ్స్, సెన్సార్ ఇంటిగ్రేషన్ ఇంజిన్ తయారీ వంటి అత్యంత సున్నితమైన సాంకేతికతను పంచుకోవడంపై ఇరు దేశాల శాస్త్రవేత్తలు, అధికారుల మధ్య లోతైన చర్చలు జరుగుతున్నాయి. ఒకవేళ ఈ ఒప్పందం కుదిరితే, దేశీయ ఉత్పత్తి రంగంలో భారత్ ఒక భారీ ముందడుగు వేసినట్లే.

**బ్రహ్మోస్ క్షిపణి అప్‌గ్రేడేషన్**

ఈ అజెండాలో ముచ్చటగా మూడో కీలక అంశం, బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూయిజ్ మిస్సైల్ వ్యవస్థ అప్‌గ్రేడ్. భారత్, రష్యాల ఉమ్మడి రక్షణ ఉత్పత్తి సామర్థ్యానికి ఈ క్షిపణి ఒక పర్ఫెక్ట్ ఉదాహరణ. ఇప్పటికే భూ, జల, వాయు మార్గాల నుంచి ప్రయోగించేలా బ్రహ్మోస్ సక్సెస్ అయింది. ఇప్పుడు దీని రేంజ్, ఫీచర్లను పెంచి మరింత ఆధునీకరించాలని రష్యా కోరుతోంది. ఇలా చేయడం ద్వారా అంతర్జాతీయ డిఫెన్స్ మార్కెట్‌లో బ్రహ్మోస్‌ను ప్రధాన ఆకర్షణగా మార్చాలనేది ఇరు దేశాల ప్లాన్. ఇప్పటికే పలు దేశాలకు బ్రహ్మోస్ ఎగుమతులు ప్రారంభమైన నేపథ్యంలో, ఈ కొత్త అప్‌గ్రేడ్ భారత్‌ను గ్లోబల్ డిఫెన్స్ ఎగుమతిదారుగా ఒక మెట్టు పైకి ఎక్కిస్తుంది. దశాబ్దాలుగా రష్యా అంటే భారత్‌కు ప్రధాన ఆయుధ సరఫరాదారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారుతోంది. అమెరికా, ఫ్రాన్స్, ఇజ్రాయెల్ దేశాల నుంచి కూడా భారత్ భారీగా రక్షణ ఉత్పత్తులు కొనుగోలు చేస్తుండటంతో రష్యా తన పాత పద్ధతులను మార్చుకుంటోంది. మరోవైపు ఉక్రెయిన్ యుద్ధం, పాశ్చాత్య దేశాల ఆంక్షల నడుమ భారత్ లాంటి నమ్మకమైన భాగస్వామిని మరింత చేరువ చేసుకునేందుకు, ఏకంగా సాంకేతికతనే పంచుకోవడానికి రష్యా సిద్ధపడటం విశేషం. పాత ఆయుధాల స్థానంలో జాయింట్ ప్రొడక్షన్, కొత్త టెక్నాలజీ, దేశీయ తయారీ ఇవే భవిష్యత్ భారత్–రష్యా రక్షణ బంధానికి పునాది కానున్నాయి. అందుకే ఈ సెప్టెంబర్ 11న జరిగే సమావేశం, భారత భద్రతా ముఖచిత్రాన్ని మార్చే కీలక ఘట్టంగా మారబోతోంది.

# ఈవీల కోసం ఎగబడుతున్న జనం

**ముంబై :** రోజురోజుకూ వాహన కొనుగోలుదారుల అభిరుచి మారిపోతోంది. మొదట్లో ఎలక్ట్రిక్ వాహనాలను కొనేందుకు జనం అంతగా ఆసక్తి చూపించలేదు. కానీ క్రమంగా ఇవి జోరందుకుంటున్నాయి. ఇప్పుడు ఆగస్ట్ నెలలో రికార్డు స్థాయిలో ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడుబోయాయి. ఓవరాల్‌గా 2026 ఆగస్టులో ఈవీ రిటైల్ విక్రయాలు 2,98,448 యూనిట్లుగా నమోదయ్యాయి. అంతకుముందు ఏడాది ఇదే సమయంతో చూస్తే ఏకంగా 52.9 శాతం వృద్ధి కనిపించింది. అంటే ఇప్పుడు సాధారణ పెట్రోల్, డీజిల్ వాహనాలతో పోలిస్తే ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ ఏ స్థాయిలో పెరిగిందో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఈ మేరకు ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ సేల్స్ డేటాను విడుదల చేసింది.అయితే ఈ ఎలక్ట్రిక్ వాహనాల్లో కేవలం కార్లు మాత్రమే కాదు.. టూ వీలర్లు, 3 వీలర్లు, ప్యాసెంజర్ వాహనాలు, కమర్షియల్ వాహనాలు ఇలా అన్నీ ఉంటాయి. వీటి సేల్స్ 2025 ఆగస్టులో 1,95,250 యూనిట్లుగా ఉండేది. మొత్తంగా వాహనాల మార్కెట్లో ఎలక్ట్రిక్ వాహనాల వాటా 9.5 శాతం నుంచి ఇప్పుడు 12.3 శాతానికి చేరినట్లు ఫాడా వెల్లడించింది. ఇక్కడ సెగ్మెంట్ వారీగా దేంట్లో సేల్స్ ఎలా ఉన్నాయో చూద్దాం.ఎలక్ట్రిక్ టూ వీలర్ సెగ్మెంట్లో చూస్తే మొత్తంగా 1,83,204 వాహనాలు అమ్ముడుబోయాయి. గతేడాదితో పోలిస్తే ఇక్కడే 67.05 శాతం విక్రయాలు పెరిగాయి. జులైతో పోలిస్తే మాత్రం స్వల్పంగా 10.37 శాతం తగ్గడం గమనార్హం. ఇక ఎలక్ట్రిక్ ప్యాసింజర్ రిటైల్ వాహనాల విక్రయాలు గతేడాది ఆగస్టుతో పోలిస్తే 51.89 శాతం పెరిగి 30,696 యూనిట్లకు పెరిగాయి. జులైతో పోలిస్తే ఇక్కడ 6.78 శాతం తగ్గింది. ఇక్కడ టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్ అగ్రస్థానంలో నిలిచింది. ఈ బ్రాండ్ నుంచే 13,158 యూనిట్లు అమ్ముడుబోవడం విశేషం. తర్వాత మహీంద్రా అండ్ మహీంద్రా 5464 యూనిట్ల విక్రయాలతో రెండో స్థానంలో ఉంది.త్రీ వీలర్ సెగ్మెంట్లో రిటైల్ వెహికిల్ సేల్స్ 79846 యూనిట్లకు చేరుకున్నాయి. గతేడాదితో పోలిస్తే ఇక్కడ వృద్ధఇ 25.28 శాతంగా నమోదైంది. ఇక ఇదే సమయంలో ఎలక్ట్రిక్ కమర్షియల్ వాహనాల రిటైల్ సేల్స్ దాదాపు మూడింతలయ్యాయి. గతేడాది ఆగస్టుతో పోలిస్తే ఏకంగా 188.3 శాతం వృద్ధి చెంది ఇప్పుడు 4702 యూనిట్లకు చేరుకోవడం విశేషం. జులైతో పోలిస్తే కూడా ఇక్కడ 30 శాతానికిపైగా వృద్ధి నమోదైంది. భారత విద్యుత్ వాహనాల చరిత్రలోనే ఈ ఆగస్ట్ అత్యుత్తమంగా నిలిచినట్లు ఫాడా ప్రెసిడెంట్ సాయి గిరిధర్ తెలిపారు. పండగ సీజన్ కాకపోయినా, నాలుగు విభాగాల్లో ఈవీ సేల్స్ సరికొత్త రికార్డులు సృష్టించడం ఈవీ ఆదరణకు అద్దం పడుతోందని చెప్పారు.



## విజయ్ నాయకత్వంలో కొత్త కూటమి

తమిళనాడులో కొత్త రాజకీయాల్లో కీలక పరిణామం జరిగింది. తమిళగ వెట్రి కళగం (టీవీకే) నేతృత్వంలోని కొత్త కూటమి ఆవిర్భవించింది. దానికి "సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్" అని పేరు పెట్టారు. చెన్నైలోని పనైయూర్‌లో ఉన్న పార్టీ ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన రెండో కూటమి సమన్వయ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ పేరే తమ కూటమి సిద్ధాంతాలను, అజెండాను తెలియజేస్తోందని తమిళనాడు పీసీసీ అధ్యక్షుడు మాణికం ఠాగూర్ తెలిపారు. తమిళనాడు హక్కుల కోసం పోరాడే పార్టీలన్నీ ఈ కూటమిలో ఉన్నాయని ఆయన చెప్పారు. త్వరలో జరిగే ఉపఎన్నికల్లో కూటమి ఉమ్మడిగా పోటీచేస్తుందని మాణికం ఠాగూర్ ప్రకటించారు. లౌకికవాదం, సామాజిక న్యాయం, రాష్ట్ర హక్కుల సాధనే ధ్యేయంగా బరిలోకి దిగనున్న కొత్త కూటమి త్వరలో జరిగే ఉపఎన్నికల్లో సత్తా చాటేందుకు వ్యూహరచన చేస్తోంది. టీవీకే వ్యవస్థాపకుడు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ అధ్యక్షతన జరిగిన ఈ కీలక సమావేశంలో కాంగ్రెస్, విదుతలై చిరుతైగల్ కట్చి (వీసీకే), మరుమలర్చి ద్రవిడ మున్నేట్ర కజగం (ఎండీఎంకే), ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐఎంయూఎల్) వంటి కీలక భాగస్వామ్య పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## విమర్శలను న్యాయవ్యవస్థ వ్యతిరేకించదు

విమర్శలను న్యాయవ్యవస్థ వ్యతిరేకించదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కానీ సమాచారం లేని వాదనలను వ్యతిరేకిస్తుందని స్పష్టం చేసింది. అయితే న్యాయవ్యవస్థపై విమర్శలను సరైన వేదిక ద్వారా నిష్పక్షపాతంగా, హేతుబద్ధమైన పద్ధతిలో వ్యక్తం చేయాలని హెచ్చరించింది. విమర్శకు, మౌనానికి మధ్య తేడా లేదని పేర్కొంది. బాధ్యతాయుతమైన చర్చకు, సమాచారం లేని వాదనకు మధ్యే తేడా ఉందని అభిప్రాయపడింది. ఎన్?సీఈఆర్‌టీ ఎనిమిదో తరగతి పాఠ్యపుస్తకంలో 'న్యాయవ్యవస్థలోని అవినీతి' అనే అంశాన్ని ప్రవేశపెట్టడంపై సుమోటోగా స్వీకరించి కేసుపై విచారణను ముగిస్తూ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్?మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. "న్యాయవ్యవస్థ విమర్శలను వ్యతిరేకించదు. వ్యతిరేకించజాలదు. ఒక శక్తివంతమైన రాజ్యాంగ ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థ పనితీరుపై నిష్పక్షపాతమైన, సమాచారంతో కూడిన, నిర్మాణాత్మకమైన విమర్శలు చేయాలి. ఆ విమర్శలు వ్యవస్థ జవాబుదారీతనానికి, స్వీయ సవరణకు దోహదపడతాయి. న్యాయవ్యవస్థపై విమర్శలు సరైన వేదిక ద్వారా నిష్పక్షపాతమైన, హేతుబద్ధమైన యంత్రాంగంలో వినిపించాలి. అంతేగానీ సున్నితమైన మనసుల కోసం ఉద్దేశించిన పాఠశాల పాఠ్యప్రణాళికలోకి ధ్రువీకరణ లేకుండా ప్రవేశించకూడదు" అని సుప్రీంకోర్టు పేర్కొంది.

**అసలేంటి వివాదం?**

ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదలైన 8వ తరగతి సోషల్ సైన్స్ పుస్తకంలోని ఛాప్టర్ 4 అయిన 'ది రోల్ ఆఫ్ ది జ్యుడిషియరీ ఇన్ సొసైటీ (సమాజంలో న్యాయ వ్యవస్థ పాత్ర)' అధ్యాయంలో న్యాయ వ్యవస్థలో అవినీతి, కేసుల పెండింగ్, మౌలిక వసతుల కొరత, న్యాయమూర్తుల కొరత వంటి అంశాలు ఉండటంతో వివాదం మొదలైంది. ఈ అధ్యాయం న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉందని అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. దీనిపైనే సుప్రీం కోర్టు సుమోటాగా విచారణ చేపట్టి ఎన్‌సీఈఆర్‌టీపై మండిపడింది. అనంతరం సోషల్ సైన్స్ బుక్‌కు సంబంధించిన ముద్రణ పూర్తైన, అలాగే డిజిటల్ కాపీలన్నింటినీ వెంటనే ఉపసంహరించుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఇంకా ఆ పుస్తకాన్ని మళ్లీ ముద్రించడం, డిజిటల్ రూపంలో ప్రచురించడం లేదా పంపిణీ చేయడంపై పూర్తి నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో ఎన్‌సీఆర్‌టీపై దేశ అత్యున్నత న్యాయస్థానంలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో సుప్రీంకోర్టుకు ఎన్‌సీఈఆర్‌టీ క్షమాపణలు చెప్పింది.

**సవరించిన పాఠ్య పుస్తకం**

అనంతరం ఎన్‌సీఈఆర్‌టీ సోషల్ సైన్స్ బుక్‌ను సవరించింది. ఈ క్రమంలో పలు మార్పులు చేసింది. 'స్వతంత్ర న్యాయ వ్యవస్థ ఎందుకు అవసరం?' అనే ప్రారంభ ప్రశ్నను తొలగించి 'న్యాయబద్ధమైన, సామరస్యపూర్వకమైన సమాజం కోసం అసలు న్యాయం ఎందుకు అవసరం? అనే కోణంలో కొత్త అంశాన్ని చేర్చింది. ఇంకా 'న్యాయ వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే విభాగాన్ని పూర్తిగా తొలగించింది. అందులో కోర్టుల్లో న్యాయమూర్తుల కొరత, క్లిష్టమైన న్యాయ ప్రక్రియ, బలహీనమైన మౌలిక వసతులే కారణమని ఉంది. ఈ అంశాన్ని పుస్తకం నుంచి తొలగించింది. అసలు ఈ వివాదానికి కేంద్ర బిందువుగా ఉన్నటువంటి న్యాయ వ్యవస్థలో అవినీతి అనే విభాగాన్ని కూడా పూర్తిగా తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది.

**ముగిసిన కేసు**

కొత్త అధ్యాయంతో కూడిన కొత్త ఎన్‌సీఈఆర్‌టీ బుక్‌ను విద్యార్థులకు పంపిణీ చేశారని సెప్టెంబరు 1న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు తెలియజేశారు. దీంతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఎన్‌సీఈఆర్‌టీ బుక్ వివాదం సివిల్ సుమోటో రిట్ పిటిషన్‌ను మూసివేసింది. కాగా, కేంద్రం ఏర్పాటు చేసిన నిపుణుల బృందం సూచించిన సవరణల ఆధారంగా వివాదాస్పద అధ్యాయాన్ని ఎన్‌సీఈఆర్‌టీ మార్చిందని సుప్రీంకోర్టు గమనించింది. కేంద్ర ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీకి సుప్రీంకోర్టు (రిటైర్డ్) జడ్జి జస్టిస్ ఇందు మల్హోత్రా నేతృత్వం వహించారు. ఈ కమిటీలో సీనియర్ న్యాయవాది, భారతదేశ మాజీ అటార్నీ జనరల్ కె.కె. వేణుగోపాల్, ప్రొఫెసర్ ప్రకాశ్ సింగ్ ఉన్నారు.

# బుల్డోజర్లు పెట్టిన కదలని హనుమాన్...

**భోపాల్ :** మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో రోడ్డు విస్తరణ పనుల కోసం ప్రాచీన హనుమంతుని ఆలయాన్ని తొలగించారు. అయితే, అందులోని హనుమ విగ్రహాన్ని మాత్రం అక్కడ నుంచి తరలించడం సాధ్యం కాలేదు. నాలుగు రోజుల పాటు అధికారులు, సిబ్బంది తీవ్రంగా శ్రమించి, భారీ యంత్రాలతో ప్రయత్నించినా... విగ్రహం ఒక్క అంగుళం కూడా కదల్లేదు. ఈ మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో చోటుచేసుకుంది. కంతాల్ చౌరాహా – ఛత్రీ చౌక్ రహదారిపై ఉన్న 'ఖడే హనుమాన్' ఆలయానికి దాదాపు 170 ఏళ్ల చరిత్ర ఉందని స్థానికులు చెబుతుంటారు.2028లో జరగబోయే 'సింహస్థ కుంభమేళా' కోసం నగరంలో మౌలిక వసతుల విస్తరణ, రోడ్ల వెడల్పు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రతి 12 ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ పుణ్యకాలంలో క్షిప్రా నదిలో పవిత్ర స్నానాలు ఆచరించేందుకు కోట్లాది మంది భక్తులు పరమశివుడి క్షేత్రమైన ఉజ్జయినికి తరలివస్తారు. అందులో భాగంగానే రహదారి విస్తరణ చేపట్టగా.. పురాతన ఆలయాన్ని తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉజ్జయిని మునిసిపల్ కార్పొరేషన్, జిల్లా యంత్రాంగం ఈ విగ్రహాన్ని టాంకీ చౌక్ సమీపంలో నూతనంగా నిర్మించే ప్రాంతానికి సురక్షితంగా తరలించాలని ప్రణాళిక రచించాయి.ఆలయాన్ని పూర్తి స్థాయిలో తొలగించినప్పటికీ, నిలబడి ఉన్న హనుమంతుని విగ్రహం మాత్రం ఉన్న చోటు నుంచి కదల్లేదు. అధికారులు, కార్మికులు భారీ యంత్రాల (జేసీబీలు, క్రేన్లు) సహాయంతో విగ్రహాన్ని తరలించడానికి అనేక ప్రయత్నాలు చేశారు. స్థానిక మీడియా నివేదిక ప్రకారం, గత కొద్ది రోజుల్లో నాలుగుసార్లు జరిపిన ప్రయత్నాలు విఫలం కావడంతో, అధికారులు భారీ యంత్రాల వినియోగాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు


**'దైవ లీల'గా ప్రచారం**

విగ్రహాన్ని కదిలించడంలో అధికారులు విఫలమవడంతో ఈ అంశం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అనేకమంది దీనిని దైవ లీలగా అభివర్ణిస్తున్నారు. అదే సమయంలో ఆలయ ప్రాంగణం వద్దకు పెద్ద ఎత్తున కోతులు గుమిగూడిన వీడియోలు నెట్టింట వైరల్ కావడంతో నమ్మకం మరింత బలపడింది.ఆలయ అర్చకుడు మహేష్ బైరాగి మాట్లాడుతూ.. వరుసగా జరుగుతున్న ఈ విఫల యత్నాలు స్వామివారు ఇక్కడే ఉండాలనుకుంటున్నారనడానికి సంకేతమని అన్నారు. "హనుమంతుడు ప్రతిరోజూ తాను ఇక్కడే ఉండాలనుకుంటున్నట్లు సంకేతాలు ఇస్తున్నారు.. అధికార యంత్రాంగం ఈ సంకేతాలను అర్థం చేసుకోవాలని నేను వినమ్రంగా వేడుకుంటున్నాను. ఒకవేళ విగ్రహాన్ని తొలగించాల్సి వస్తే, అది ఎటువంటి దెబ్బతినకుండా ప్రస్తుతం ఏ రూపంలో ఉందో అదే విధంగా భద్రంగా తరలించాలి. పూర్తి భద్రత హామీ ఇచ్చే వరకు విగ్రహాన్ని కదిలించే ప్రయత్నం చేయకూడదు" అని ఆయన తెలిపారు.

# భూముల భద్రతే లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

మూడేళ్ల క్రితం సీఎం చంద్రబాబును నాటి ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేసిందని... ఆ అక్రమ అరెస్ట్ జరిగి సెప్టెంబర్ 9కి సరిగ్గా మూడేళ్లు అయిందంటూ నాటి సంగతులను ఆవేదనతో ప్రస్తావించారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా నాడు జరిగిన అంశాలను బహిరంగ సభలో గుర్తు చేసుకున్నారు. నంద్యాలలో సాగునీటి ప్రాజెక్టుల పరిశీలన సమయంలో మూడేళ్ల క్రితం సెప్టెంబరు 9న అర్ధరాత్రి వచ్చి తనను అరెస్టు చేస్తామని చెప్పారని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. ఏ తప్పు చేయకపోయినా అర్ధరాత్రి పూట తనను అరెస్టు చేశారని తెలిపారు. తనపై ఉన్న ఆరోపణలు ఏమిటని ప్రశ్నిస్తే.. అరెస్టు చేసిన తర్వాత చెబుతామని చెప్పారని అన్నారు. ముఖ్యమంత్రిగా పని చేసిన తనను ఉన్నపళంగా అరెస్టు చేసి రాజమహేంద్రవరం జైలుకు తరలించారని పేర్కొన్నారు. తన జీవితంలో ఎన్నడూ ఊహించని ఆ సంఘటన ఓ దుర్మార్గమైన వ్యక్తి ఆలోచనల వల్ల జరిగిందని వ్యాఖ్యానించారు. తాను 48 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని, 31 ఏళ్ల క్రితమే తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టానని చంద్రబాబు అన్నారు. విలువలతో కూడిన రాజకీయాలు చేయాలని, పేద ప్రజలకు, తెలుగు జాతికి న్యాయం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నానని తెలిపారు. తనపై అనేకమంది ఆరోపణలు చేశారని, కోర్టులకు వెళ్లారని, అయితే తనపై చేసిన ఆరోపణలను రుజువు చేయలేకపోయారని చెప్పారు. అదే తన నిబద్ధతకు నిదర్శనమన్నారు. రాజకీయాలపై కుటుంబం ఆధారపడకూడదనే ఉద్దేశంతో 36 ఏళ్ల క్రితమే కుటుంబ వ్యాపారాన్ని ప్రారంభించామని చంద్రబాబు తెలిపారు. తాను ఆర్థిక మంత్రిగా, ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించిన సమయంలో కుటుంబ వ్యాపారాన్ని తన సతీమణికి అప్పగించానన్నారు. తనకు ధన వ్యామోహం లేదని, తెలుగు జాతి బాగుండాలన్నదే నిరంతరం తన ఆలోచన అని స్పష్టం చేశారు. జైలులో ఉన్న సమయంలో తనకేం జరుగుతుందోనన్న ఆందోళనతో తెలుగు జాతి మొత్తం రోడ్లపైకి వచ్చిందని ముఖ్యమంత్రి అన్నారు. నేను జైల్లో




ఉన్నప్పుడు నాకు సంఘీభావం తెలిపిన వారిని... నా గురించి ఆందోళన చెందిన వారిని జీవితాంతం గుర్తుంచుకుంటానని తెలిపారు. రాజమండ్రి జైల్లో ఉన్న తనను కలిసేందుకు... సంఘీభావం తెలిపేందుకు కొందరు అడ్డుపడినా హైదరాబాద్‌లో టెకీలు సైతం ముందుకు వచ్చి నిరసనలు తెలిపారని సీఎం చంద్రబాబు చెప్పారు. దేశవిదేశాల్లోని తెలుగు వారంతా స్పందించారన్నారు. ఇక నాడు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపిన మద్దతును ఎన్నటికీ మరిచిపోలేనన్నారు. తనకు సంఘీభావం తెలిపేందుకు వస్తుంటే ఆయననూ అడ్డుకున్నారని చంద్రబాబు అన్నారు. అయినా ఏమాత్రం వెనక్కి తగ్గకుండా పవన్ కల్యాణ్ తనకు సంఘీభావం తెలిపారని గుర్తుచేశారు. గత పాలకులు పెట్టిన కేసులను కోర్టులు కొట్టేశాయని, ఈడీ వంటి సంస్థలు కూడా ఇందులో ఏమీ లేదని తేల్చాయని ముఖ్యమంత్రి తెలిపారు. గతంలో అచ్చెన్నాయుడు వంటి నేతలను బలవంతంగా అరెస్టు చేసి వేధించారని, పవన్ కల్యాణ్ విశాఖ వెళ్లినప్పుడు ఆయన్ను అక్కడి నుంచి బలవంతంగా వెనక్కి పంపించారని అన్నారు. ఇలాంటి ఘటనలు గత పాలనలో ఎన్నో జరిగాయని సీఎం పేర్కొన్నారు. తాను ముఖ్యమంత్రి అయ్యాక ప్రతీకారం తీర్చుకోవాలంటే ఒక్క నిమిషం చాలని చంద్రబాబు అన్నారు. కానీ తాను ఆ పని చేయలేదని స్పష్టం చేశారు. తాను సహనంగా... ఓపిగ్గా ఉంటానని వెల్లడించారు. గత పాలకులు అంతగా వేధించినా... ఏం చేయలేకపోతున్నానని చాలా మంది అనుకుంటారని.. కానీ అది తన విధానం కాదన్నారు. జగన్‌ను వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చదువుకోవడానికి అమెరికా పంపిస్తే.. తిరుగుటపాలో వచ్చేశాడని స్వయంగా వైఎస్ చెప్పిన విషయాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తన కుమారుడిని ఎప్పుడూ ఏపీకి రానీయలేదని చంద్రబాబు అన్నారు. కొడుకుతో ఇబ్బందులు భరించలేక జగన్‌ను బెంగళూరులోనే ఉంచారని ఆయన తల్లి విజయమ్మ మాజీ ముఖ్యమంత్రి రోశయ్యకు చెప్పుకుని బాధపడ్డారని చంద్రబాబు నాటి సంగతులను గుర్తు చేశారు.

# న్యాయపోరాటంలో డీఎస్సీ అభ్యర్థులు

**విజయవాడ :** మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల కష్టాన్ని, పారదర్శకంగా జరిగిన నియామకాల ప్రక్రియను దెబ్బతీసేలా సాగుతున్న ఫేక్ ప్రచారాలపై ఇక కేవలం ప్రెస్ మీట్ల స్పష్టతలతో సరిపెట్టుకోవడం సాధ్యం కాదు. నిబంధనల ప్రకారం కష్టపడి మెరిట్ సాధించి ఉద్యోగాలు పొందిన టీచర్లు తమ కష్టాన్ని కించపరిచేలా సోషల్ మీడియా, కొన్ని మీడియా ఛానెళ్లలో జరుగుతున్న తప్పుడు దాడిపై నేరుగా న్యాయపోరాటానికి సిద్ధం కావాల్సిన సమయం వచ్చింది. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తూ తమ ఆత్మగౌరవాన్ని, భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్న వారిపై ప్రతి ఉపాధ్యాయుడు వ్యక్తిగతంగా సివిల్, క్రిమినల్ పరువునష్టం కేసులు వేయడం ద్వారానే ఈ వికృత క్రీడకు అడ్డుకట్ట పడుతుంది. ఆరోపణలకు గురవుతున్న బాధిత ఉపాధ్యాయులందరూ ఐక్యంగా ఒక వేదికపైకి వచ్చి, రూ. కోట్ల పరిపరిహారాన్ని డిమాండ్ చేస్తూ క్రిమినల్ దావాలు దాఖలు చేయాలి. ఫేక్ స్కామ్ అంటూ కోర్టు పరిధిలో తేలని విషయాలను జడ్జిమెంట్లుగా ప్రచారం చేస్తున్న మీడియా సంస్థలు, యూట్యూబర్లు, రాజకీయ నాయకులకు లీగల్ నోటీసులు పంపాలి. స్వయంగా కష్టపడి సాధించుకున్న ఉద్యోగాన్ని సవాలు చేస్తూ విచారణ పేరుతో మానసిక క్షోభకు గురిచేస్తున్న ప్రతి ఒక్కరినీ కోర్టు బోనులో నిలబెట్టినప్పుడే, బాధ్యతారాహిత్యంగా మాట్లాడే వారికి చట్టం పవర్ ఏంటో అర్థమవుతుంది. మరోవైపు ఏపీ ప్రభుత్వం కూడా ఇక ఎంతమాత్రం ఉపేక్షించే ధోరణిలో ఉండకూడదు. అధికారులు ప్రతిసారీ స్క్రీన్లపై ఆధారాలు చూపుతూ కేస్-టు-కేస్ ఓపికగా సమాధానాలు ఇచ్చినంత కాలం ఇచ్చారు. కానీ, ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వ వ్యవస్థల పరువు తీయడమే లక్ష్యంగా కుట్రపూరిత ప్రచారాలు చేస్తున్న వారిపై ప్రభుత్వమే స్వయంగా కేసులు నమోదు చేయాలి. ఫేక్ న్యూస్, డీఎస్సీ నియామకాల ప్రాసెస్‌పై ఎప్పటికప్పుడు వస్తున్న ఆరోపణలు, సామాజిక మాధ్యమాల్లో జరిగే ప్రచారాలు కేవలం ఒక వ్యవస్థను మాత్రమే కాకుండా, రాత్రింబవళ్లు కష్టపడి ఉద్యోగాలు సాధించిన వేలాదిమంది ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని కూడా దెబ్బతీస్తున్నాయి. ప్రభుత్వం ఇచ్చే వివరణలు లేదా పత్రికా ప్రకటనలు కేవలం తాత్కాలిక సడలింపునిస్తాయే తప్ప, ఇలాంటి దుష్ప్రచారాలకు శాశ్వత ముగింపు పలకలేవు. చట్టం ఇచ్చిన రక్షణలను సద్వినియోగం చేసుకుంటూ, ఆధారాలు లేని తప్పుడు ప్రచారాలపై కఠినమైన చట్టపరమైన చర్యలకు పూనుకోవాల్సిన అవసరం ఇప్పుడు ఎంతైనా ఉంది. భారతీయ శిక్షాస్మృతి పరిధిలోని క్రిమినల్ నిబంధనల ప్రకారం కీర్తి ప్రతిష్టలకు భంగం కలిగించినందుకు క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చు. అంతేకాకుండా, సివిల్ కోర్టులలో కోట్ల రూపాయల పరువు నష్టం దావాలు వేయడం ద్వారా తప్పుడు ప్రచారం చేసేవారికి ఆర్థికపరమైన భయాన్ని కలిగించవచ్చు. సోషల్ మీడియా ద్వారా ఈ ప్రచారాలు జరుగుతున్నందున, సమాచార సాంకేతిక పరిజ్ఞాన చట్టం కింద కూడా ఫిర్యాదులు చేసి, ఆయా ఖాతాలను బ్లాక్ చేయించడంతో పాటు బాధ్యులపై సైబర్ కేసులు నమోదు చేయవచ్చు. ప్రభుత్వం , విద్యాశాఖ కేవలం ప్రేక్షక పాత్ర వహించకుండా, డిఫెన్సివ్‌గా సమాధానాలు ఇవ్వడంతో సరిపెట్టకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ప్రభుత్వ యంత్రాంగం నిర్వహించే అధికారిక పరీక్షల పై అసత్యాలు వ్యాప్తి చేయడం ప్రభుత్వ ప్రతిష్టను కూడా దెబ్బతీస్తుంది. కాబట్టి, సదరు ఉద్దేశపూర్వక దాడి వెనుక ఉన్న మూలాలను గుర్తించి, పోలీసు శాఖ ద్వారా సుమోటోగా కేసులు నమోదు చేయడం, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ద్వారా డైరెక్ట్ క్రిమినల్ కంప్లైంట్ నమోదు చేయించడం ప్రభుత్వం వైపు నుంచి జరగాల్సి ఉంది. వివరణల కాలం ముగిసింది.. చట్టపరమైన చర్యల కాలం మొదలైంది అనే సంకేతం సమాజంలోకి వెళ్లాలి.

**చక్రపాణి రెడ్డి బూమ్ రాంగ్ అవుతుందా**

డీఎస్సీలో ఉద్యోగం సంపాదించి కుప్పంలో ఓ స్కూల్లో పని చేస్తున్నారు చక్రపాణి రెడ్డి. ఆయన మాజీ సైనికుడు, సెయిలింగ్ క్రీడాకారుడు కూడా. దేశ సేవ నుంచి రిటైరైన తర్వాత బీఈడీ పూర్తి చేసి ఉద్యోగం సంపాదించుకున్నారు. ఆయనతో రిపోర్టర్ అనుచితంగా ప్రవర్తించాడు. ఉపాధ్యాయ దినోత్సవం రోజే స్కూల్ కు వెళ్లి పిల్లల ముందే చొక్కా పట్టుకుని సర్టిఫికెట్లు చూపించాలని దౌర్జన్యం చేశాడు. ఇవన్నీ ఫోన్ లో రికార్డు అయ్యాయి. దాంతో పోలీసు కేసు నమోదు అయింది. ఇంత వరకూ బాగానే ఉన్నా.. చక్రపాణి రెడ్డిపై సాక్షి పేరుతో దౌర్జన్యం చేయడం మాత్రం ఓ వర్గంలో కలకలం రేపుతోంది. స్పోర్ట్స్ కోటా పేరుతో బీసీలపై దాడి చేస్తూ వచ్చారు ఇప్పటి వరకూ. అయితే రెడ్డి వర్గాన్ని కూడా వదలడం లేదని కుప్పం టీచర్ ఉదంతంతో క్లారిటీ వచ్చింది. ఓసీల్లో ఉండి ఉద్యోగం తెచ్చుకోవడం ఎంత ఆ వర్గంలో ఉండే వారికి తెలుసు. మాజీ సైనికుడు అయిన చక్రపాణి రెడ్డికి ఉద్యోగం వస్తే ఆయనను అవమానించడమే కాదు.. సాక్షిలోనూ తప్పుడు ప్రచారం చేశారు. ఈ అంశం రెడ్డి వర్గంలోనూ చర్చకు వస్తోంది. మాగుంట శ్రీనివాసులరెడ్డి ఇటీవల వెలిగొండ వేదికపై జగన్ ను మూర్ఖుడని తిట్టారు. ఇలాంటివి చేయాలని జగన్ రెడ్డి చెప్పరు కానీ ఆయన నైజానికి తగ్గట్లే జరుగుతాయి. ఆయన కు అవి ఇష్టం కాబట్టి సజ్జల చేయిస్తారు. దాని వల్ల ఎంత నష్టం జరుగుతుందో చెప్పడం కష్టం. మాగుంట మాట్లాడిన మాటల కన్నా.. కుప్పం టీచర్ చక్రపాణి రెడ్డి ఆవేదన .. వైసీపీకి ఊహించని నష్టం చేయబోతోంది.

# పార్టీల పేర్లతో ఐడీలు తీవ్రమైన ఈగో పోరు

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న టీడీపీ-జనసేన కూటమి ప్రభుత్వ విధానాలు, విజయాలు ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుపడుతున్న ప్రధాన శక్తి ప్రతిపక్షం కంటే కూడా ఇరు పార్టీల సానుభూతిపరులుగా సోషల్ మీడియాలో చెలామణి అవుతున్నవారే. అనడంలో ఎలాంటి సందేహం లేదు. క్షేత్రస్థాయిలో నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ పొత్తు ధర్మాన్ని పాటించి పాలనపై దృష్టి సారిస్తుంటే, సోషల్ మీడియాలో ఇరు పార్టీల పేర్లతో తిరిగే ఐడీలు తీవ్రమైన ఈగో పోరుతో కూటమి స్ఫూర్తికే ఘోరమైన విఘాతం కలిగిస్తున్నాయి. ముఖ్యంగా సినీ హీరోల అభిమానుల మధ్య ఉండే పాత కక్షలు, వ్యక్తిగత ఆధిపత్య పోరును రాజకీయాలకు రుద్ది, పరస్పరం పార్టీ అధినేతలను, వారి కుటుంబ సభ్యులను అసభ్యకరంగా దూషించుకునే స్థాయికి దిగజారిపోతున్నారు. సాధారణంగా ఏ రాజకీయ పార్టీకైనా సోషల్ మీడియా విభాగం లేదా సానుభూతిపరులు అనేది ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పాలనా సంస్కరణలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే డిజిటల్ సైన్యంలా పనిచేయాలి. అయితే ఈ రెండు పార్టీల సోషల్ మీడియా అతివాదులు మాత్రం ప్రభుత్వం సాధిస్తున్న విజయాలు, పారిశ్రామిక అభివృద్ధి వంటి అంశాలను పక్కనబెట్టి.. పరస్పరం చురకలు వేసుకోవడానికి, ఎన్టీఆర్ లేదా చిరంజీవి వంటి దిగ్గజాల పేర్లను లాగి బురద



చల్లుకోవడానికే సమయాన్ని వెచ్చిస్తున్నారు. అసలైన ప్రాధాన్యతలను విడిచిపెట్టి వ్యక్తిగత ద్వేషాన్ని ప్రచారం చేసే వీరు ఎంతమాత్రం పార్టీ సానుభూతిపరులు అనిపించుకోరు, పైగా ప్రత్యర్థి పార్టీ వైఎస్ఆర్‌సీపీకి అయాచితంగా పొలిటికల్ అడ్వాంటేజ్‌ను ప్లేట్‌లో పెట్టి ఇస్తున్నారు. వైసీపీ అమలు చేస్తున్న ఫేక్ నెరేటివ్‌లు, ప్రభుత్వ విధానాలపై చేస్తున్న తప్పుడు ప్రచారాలను సంయుక్తంగా తిప్పికొట్టాల్సిన సమయంలో.. ఈ రెండు వర్గాలు ఒకరి శాఖల్లోని లోపాలను మరొకరు వెతికి నెట్‌లో రచ్చకెక్కడం కూటమి ప్రభుత్వ పరువు తీస్తోంది. ఇటు టీడీపీ శ్రేణులు, అటు జనసేన సైనికులు పరస్పరం డిపార్ట్‌మెంట్ వ్యాఖ్యలపై కౌంటర్లు ఇచ్చుకోవడం వల్ల ప్రజల్లోకి ప్రభుత్వంలో సమన్వయం లేదు అనే తీవ్ర ప్రతికూల సంకేతాలు వెళ్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలు ముంచుకొస్తున్న ఈ కీలక సమయంలో, ప్రయివేటు అకౌంట్ల నుంచి జరిగే ఈ విపరీతమైన ఈగో వార్ రాజకీయంగా కూటమి పునాదులకే ఎసరు పెట్టే ప్రమాదం ఉంది. దీన్ని ఆసరా చేసుకుని వైసీపీ సోషల్ మీడియా టీడీపీ, జనసేన పేరుతో ఫేక్ అకౌంట్లను రంగంలోకి తెచ్చి మరింతగా వివాదాలను పెంచుతోంది. ఈ పరిస్థితికి చెక్ పెట్టాలంటే కేవలం హెచ్చరికలు, హితవులతో సరిపెట్టుకుంటే లాభం లేదు. ఇరు పార్టీల నాయకత్వాలు సీరియస్‌గా స్పందించి, తమ అధికారిక సోషల్ మీడియా వింగ్‌ల ద్వారా క్రమశిక్షణను కఠినంగా అమలు చేయాల్సి ఉంది. హద్దులు దాటి పరస్పర అధినేతలను, కుటుంబ సభ్యులను అసభ్యకరంగా దూషిస్తున్న ఐడీలను గుర్తించి, వారు సొంత కేడర్ అయినా సరే సైబర్ పోలీసుల ద్వారా చట్టపరమైన చర్యలు తీసుకోవడం లేదా పార్టీల నుంచి బహిరంగంగా దూరం పెట్టడం చేయాలి. పార్టీ ఆత్మగౌరవం కంటే కూటమి బంధం, ప్రభుత్వ స్థిరత్వమే ముఖ్యమని ఇరు అధినేతలు కేడర్‌కు గట్టిగా స్పష్టం చేయాల్సిన సమయం ఆసన్నమైంది. ఉమ్మడి రాజకీయ ప్రత్యర్థి వైఎస్ఆర్‌సీపీపై పోరాడటాన్ని మర్చిపోయి, తమలో తామే సోషల్ మీడియాలో కొట్టు చావడం అనేది కూటమి ఐక్యతకు కన్పించని శత్రువులా మారింది.

## ప్రభుత్వ పథకాల అర్హులను ఇట్టే గుర్తించొచ్చు

-మొదటిపేజీ తరువాయి

మెరుగైన ఫలితాలను ఇస్తుందని ప్రాథమికంగా వెల్లడైంది. తద్వారా ప్రభుత్వానికి సమయం కూడా ఆదా అవుతుందనే విషయం ప్రాథమికంగా తేలింది. ఈ క్రమంలోనే ఇందుకు సంబంధించిన ఫలితాలను సీఎం చంద్రబాబుతో పాటు ఉన్నతాధికారులకు ఐఐటీ కాన్పూర్ ప్రతినిధులు వివరించారు. ఈ ప్రక్రియలో సుమారు 15 ప్రభుత్వ డేటా సెట్‌లను ఉపయోగించామని వాద్వానీ స్కూల్ ఆఫ్ ఏఐ అండ్ ఇంటెలిజెన్స్ సిస్టమ్స్ డీన్ ప్రొఫెసర్ నితిన్ సక్సేనా తెలిపారు. తద్వారా కుటుంబాల సామాజిక, ఆర్థికస్థితిని అంచనా వేసి, వాటిని నిర్దిష్ట వర్గాలుగా విభజించేలా 'ఫ్యామిలీ స్కోర్' వ్యవస్థ పని చేస్తుందని నితిన్ సక్సేనా వివరించారు.

ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సవాళ్లతో పాటు అర్హులైన కుటుంబాలను గుర్తించడంలో 'ఫ్యామిలీ స్కోర్' సహాయపడుతుందని ఐఐటీ కాన్పూర్ డైరెక్టర్ ప్రొఫెసర్ మనీంద్ర అగర్వాల్ పేర్కొన్నారు. ప్రాథమిక ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉన్నాయని చెప్పారు. తద్వారా డబ్బు, సమయం ఆదా అవుతుందనే విషయాన్ని ఇవి సూచిస్తున్నాయని తెలిపారు. ఏపీ ప్రభుత్వ సహకారంతో పౌరుల ప్రయోజనం కోసం ఏఐని పారదర్శకంగా, విశ్వసనీయంగా ఎలా ఉపయోగించవచ్చో ఇది నిరూపిస్తుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐరావత్ రీసెర్చ్ ఫౌండేషన్ సీఈవో మనీశ్? శ్రీవాస్తవ పాల్గొన్నారు. ఐఐటీ కాన్పూర్ అభివృద్ధి చేసిన ఏఐ ఆధారిత వ్యవస్థను సీఎం చంద్రబాబుతో పాటు ఉన్నతాధికారులు ప్రశంసించారు.

## భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు రవాణా సౌకర్యాలేంటి?

-మొదటిపేజీ తరువాయి

ఎలాంటి రవాణా సౌకర్యాలు కల్పించారు, ఏయే సమయాల్లో బస్సులు తిప్పుతున్నారు, ఎన్ని విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయి, ఆయా సమయాలకు తగ్గట్టు రవాణా సౌకర్యం ఉందా తదితర వివరాలను తమ ముందు ఉంచాలని ఆదేశించింది.

**విచారణ వాయిదా వేసిన కోర్టు**

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి సివిల్, వాణిజ్య కార్యకలాపాలను నిలిపివేస్తూ భోగాపురం అంతర్జాతీయ విమాశ్రయం నుంచి కార్యకలాపాలు నిర్వహించేందుకు వీలు కల్పిస్తూ సివిల్ ఏవియేషన్ మంత్రిత్వశాఖ ఈ ఏడాది జులై 28న జారీచేసిన నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి ఎం. రామారావు, మరో ఇద్దరు హైకోర్టులో పిల్ వేశారు.

**ప్రయాణికుల ఇబ్బందులు**

వారి తరఫున న్యాయవాది వి.లక్ష్మీహరీశ్ వాదనలు వినిపిస్తూ భోగాపురం విమానాశ్రయం చేరుకోవడానికి పెద్ద సమస్యగా ఉందన్నారు. విశాఖపట్నం నుంచి భోగాపురం చేరుకోవడానికి సుమారు రెండు గంటల సమయం పడుతుంది అన్నారు. బస్సుల సౌకర్యం లేదన్నారు. ఒకసారిగా విశాఖ విమానాశ్రయం నుంచి కార్యకలాపాలను నిలిపివేయడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం భోగాపురం విమానాశ్రయానికి ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు ఏర్పాటు చేసిన రవాణా సౌకర్యాలేమిటో చెప్పాలని ఏజీని ప్రశ్నించింది.

**ప్రభుత్వ వివరణకు కోర్టు సూటి ప్రశ్న**

రాష్ట్రప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ సాధారణ రవాణా బస్సుల సౌకర్యంతో పాటు అదనంగా 20 ఎలక్ట్రికల్ బస్సులు ఉదయం 4 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు నడుస్తున్నాయన్నారు. కార్లు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ వాదనలపై ధర్మాసనం స్పందిస్తూ రాత్రి ఏడు గంటల తర్వాత విమానాలు రాకపోకలు సాగించడం లేదా అని ప్రశ్నించింది. ప్రస్తుతం ఏర్పాటు చేసిన బస్సులు సరిపోవేమోనని అభిప్రాయపడింది. విమానాల రాకపోకల సమయం, ఆ సమయాల్లో కల్పించిన రవాణా సౌకర్యాలేమిటో కోర్టుకు తెలియజేయాలంటూ విచారణను వాయిదా వేసింది.

## స్థానిక ఎన్నికల్లో గట్టిగా నిలబడాలి

-మొదటిపేజీ తరువాయి

పార్టీ బలోపేతం, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. వచ్చే ఏడాది సెప్టెంబరు లేదా అక్టోబరు నుంచి తన పాదయాత్ర ప్రారంభమవుతుందని వైయస్ జగన్ తెలిపారు. పర్చూరు నియోజకవర్గం మీదుగా కూడా పాదయాత్ర సాగుతుందని చెప్పారు. గత వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత చంద్రబాబు పాలనకు మధ్య ఉన్న తేడాను ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలన, చంద్రబాబు రెండున్నరేళ్ల పాలన మధ్య తేడాపై ప్రతి ఇంట్లో చర్చ జరుగుతోందని వైయస్ జగన్ అన్నారు. ప్రతి కార్యకర్త సగర్వంగా ప్రజల ముందుకు వెళ్లి తమ ప్రభుత్వ పాలన గురించి చెప్పుకోగలిగేలా పాలన సాగించామని తెలిపారు. మ్యానిఫెస్టోకు ఒక అర్థం తీసుకొచ్చి 99 శాతం హామీలను అమలు చేసిన చరిత్ర వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వానిదని చెప్పారు. మ్యానిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌లా భావించి ప్రతి మాటకు కట్టుబడి పనిచేశామని, ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని తెలిపారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో మ్యానిఫెస్టోతో పాటు ప్రతి ఇంటికీ బాండ్లు పంపి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ప్రతి ఏటా బడ్జెట్ సమయంలోనే పథకాలు, కార్యక్రమాల క్యాలెండర్‌ను ప్రకటించి అమలు చేసిన ఘనత తమ ప్రభుత్వానిదని వైయస్ జగన్ అన్నారు. వ్యవస్థలో ఎప్పుడూ చూడని మార్పులు తీసుకొచ్చామని తెలిపారు. ప్రతి 50 ఇళ్లకు ఒక వాలంటీర్, ప్రతి గ్రామంలో సచివాలయం ఏర్పాటు చేసి ప్రభుత్వ పాలనను ప్రజల ఇంటి గడప వద్దకే తీసుకెళ్లామని చెప్పారు. రైతులు, పిల్లలు, మహిళలు, పేదలకు అందించే పథకాలను లంచాలు లేకుండా, పూర్తి పారదర్శకంగా అమలు చేశామని వివరించారు. ప్రభుత్వ పాఠశాలలను నాడు--నేడు ద్వారా ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అభివద్ధి చేశామని వైయస్ జగన్ తెలిపారు. మూడో తరగతి నుంచే టోఫెల్ శిక్షణ, ఆరో తరగతి నుంచి డిజిటల్ బోర్డులు, బైలింగ్వల్ టెక్స్ట్‌బుక్స్, ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందించామని చెప్పారు. ఆరోగ్యశ్రీలో ప్రొసీజర్ల సంఖ్యను 1,000 నుంచి 3,300కు పెంచామని, రూ.25 లక్షల వరకు వైద్యం అందించేలా పథకాన్ని విస్తరించామని తెలిపారు. ప్రతి గ్రామంలో విలేజ్ క్లినిక్స్, నాడు--నేడు ద్వారా ఆస్పత్రుల అభివద్ధి, ఫ్యామిలీ డాక్టర్ విధానం తీసుకొచ్చామని చెప్పారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ సంతకాలతో ప్రతి ఇంటికీ బాండ్లు పంపి అనేక హామీలు ఇచ్చారని వైయస్ జగన్ అన్నారు. అమ్మ ఒడి, ఆడబిడ్డ నిధి, రైతులకు ఆర్థిక సాయం, చేయూత, నిరుద్యోగ భతి వంటి పథకాల పేరుతో భారీగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయలేదని విమర్శించారు. రాబోయే స్థానిక ఎన్నికలు కార్యకర్తల ఎన్నికలని వైయస్ జగన్ అన్నారు. ప్రజలకు కార్యకర్తలు అండగా నిలుస్తారని, వారికి పార్టీ తోడుగా నిలవాలని చెప్పారు. అధికార దుర్వినియోగం, పోలీసు బలగాల ప్రయోగం వంటి చర్యలను ప్రజలు గమనిస్తున్నారని, వాటిపై ప్రజల్లో ఉన్న ఆగ్రహం భవిష్యత్ సాధారణ ఎన్నికల్లో వ్యక్తమవుతుందని తెలిపారు. పాలకుడు మంచి పనులు చేసి వాటిని ప్రజలకు చూపించి ఓట్లు అడగాలని, అప్పుడు ప్రజలు ఆదరిస్తారని వైయస్ జగన్ అన్నారు. అబద్ధాలు, దౌర్జన్యాలతో ఎల్లవేళలా పాలన సాగించలేరని స్పష్టం చేశారు. జరగబోయే కురుక్షేత్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అండగా నిలబడి గట్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు.

## సింహపురిలో రియల్ జోరు

**నెల్లూరు :** నెల్లూరు నగరంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కొత్త దారిలో వెళ్తోంది. నగర పరిధిలోని కీలకమైన మినీ బైపాస్ రోడ్డు, కృష్ణపట్నం పోర్ట్ కనెక్టివిటీ రహదారుల పొడవునా సెమీ-లగ్జరీ అపార్ట్‌మెంట్లు, ఆధునిక కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలు భారీగా పుంజుకున్నాయి. జాతీయ రహదారి కి, పోర్ట్ రవాణా కారిడార్‌కు అనుసంధానంగా ఉన్న ఈ ప్రాంతాలు నివాస , వ్యాపార అవసరాలకు అనువుగా మారడంతో డెవలపర్లు సరికొత్త ప్రాజెక్టులతో ముందుకు వస్తున్నారు. కృష్ణపట్నం పోర్ట్ ఆధారిత లాజిస్టిక్స్, షిప్పింగ్ సంస్థలు, మైనింగ్ , మల్టీ-మోడల్ ట్రాన్స్‌పోర్ట్ రంగాలు శరవేగంగా విస్తరిస్తుండటంతో నెల్లూరు నగరంలో ఆయా కంపెనీల అధికారులు, ఇంజనీర్ల నివాస అవసరాలు పెరిగాయి. దీనికి తోడు మెరుగైన అద్దె ఆదాయం వస్తుండటంతో విదేశాల్లో ఉండే నెల్లూరు జిల్లావాసులు తమ పెట్టుబడులను మినీ బైపాస్ పరిసరాల్లోని సెమీ-లగ్జరీ ఫ్లాట్లు, కమర్షియల్ ప్రాపర్టీలపై కేంద్రీకరిస్తున్నారు. సేఫ్ ఇన్వెస్ట్‌మెంట్‌గా భావిస్తూ ముందస్తుగానే అపార్ట్‌మెంట్లను బుక్ చేసుకుంటున్నారు.

# వెలిగొండ ఫీడర్ కెనాల్‌లో గల్లంతైన వ్యక్తి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టిన మార్కాపురం పోలీసులు

**దోర్నాల : సెప్టెంబర్ 10 (మీ వార్త ప్రతినిధి)**
ఈ నెల 5వ తేదీన వెలిగొండ ఫీడర్ కెనాల్ వద్ద నీటిని చూసేందుకు వెళ్లిన దోర్నాల మండలం కటకానిపల్లి గ్రామానికి చెందిన పుప్పాల రాజ్‌కుమార్ (23), పుప్పాల వినయ్‌కుమార్ (23) ప్రమాదవశాత్తు కాలువలోకి జారిపడి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, గాలింపు చర్యలు చేపట్టారు. మార్కాపురం జిల్లా ఎస్పీ "వి.హర్షవర్ధన్ రాజు" ఐపీఎస్ ఆదేశాల మేరకు మార్కాపురం డీఎస్పీ నాగరాజు ఆధ్వర్యంలో సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు ముమ్మరంగా చేస్తున్నారు. ఫిషరీస్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన గజ ఈతగాళ్లు, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలను తో పాటు మనుషులు వెళ్లి గాలించడానికి వీలులేని ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాల సహాయంతో గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఈ నెల 6వ తేదీ ఉదయం నుంచి వెలిగొండ ఫీడర్ కెనాల్‌తో పాటు నల్లమల్లసాగర్‌లో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టగా, 7వ తేదీ సాయంత్రం పుప్పాల వినయ్‌కుమార్ మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.
మరో వ్యక్తి పుప్పాల రాజ్‌కుమార్ ఆచూకీ కోసం





ప్రస్తుతం 15 మంది ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందితో పాటు పోలీసు సిబ్బందిని ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేసి, నాలుగు డ్రోన్ల సహాయంతో నల్లమల్లసాగర్ పరిసర ప్రాంతాల్లో ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. అదనంగా, మరో 15 మంది సభ్యులతో కూడిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం ఈరోజు అక్కడికి చేరుకుని గాలింపు, సహాయక చర్యల్లో పాల్గొననుంది. నల్లమల్ల సాగర్‌లోకి ఇటీవల కొత్తగా నీరు చేరడంతో, గతంలో చెట్లు, ముళ్లకంచెలు, దట్టమైన ముళ్లపొదలు ఉన్న ప్రాంతాలు నీటిలో మునిగిపోయాయి. దీంతో కొన్ని ప్రాంతాల్లో గాలింపు చర్యలు క్లిష్టంగా మారినప్పటికీ, ఎస్‌డీఆర్‌ఎఫ్ మరియు పోలీసు సిబ్బంది అ ందుబాటులో ఉన్న అన్ని వనరులను వినియోగిస్తూ ప్రతి ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. రాజ్‌కుమార్ ఆచూకీ లభించే వరకు గాలింపు చర్యలను నిరంతరాయంగా కొనసాగిస్తూ, అందుబాటులో ఉన్న అన్ని వనరులను వినియోగించి పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలు కాలువ,సాగర్ పరిసర ప్రాంతాలకు అనవసరంగా వెళ్లవద్దని, నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో నీటిలోకి దిగడం లేదా సెల్ఫీలు తీసుకోవడం వంటి ప్రమాదకర చర్యలకు పాల్పడవద్దని పోలీసులు సూచించారు. పిల్లలు, యువత నీటి ప్రాంతాలకు ఒంటరిగా వెళ్లకుండా జాగ్రత్త వహించాలని, పోలీసుల సూచనలు, హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.

# కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 50 ఏళ్లు నిండిన బీసీ, ఎస్సీ, మైనారిటీలకు పెన్షన్ ఇవ్వాలి

**కుక్కునూరు, సెప్టెంబర్ 9 (మి వార్తా ప్రతినిధి** : కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు 50 ఏళ్లు నిండిన బీసీ, ఎస్సీ, మైనారిటీలకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామాజిక పెన్షన్ల నమోదు గడువును సెప్టెంబర్ నెలాఖరు వరకు పొడిగించాలని కోరారు. స్థానిక సుందరయ్య భవనం ప్రజాసంఘాల కార్యాలయంలో మంగళవారం నాడు సిపిఎం పార్టీ ముఖ్య కార్యకర్తలు సమావేశం షేక్ వలిపాషా అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల మూడు నెలల అనంతరం తొలిసారిగా సామాజిక పెన్షన్లను విడుదల చేయడంతో పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న పేదలకు కొంత ఊరట కలిగిందన్నారు. అయితే దరఖాస్తు ప్రక్రియలో విధించిన నిబంధనలు, వివిధ ధ్రువపత్రాల కారణంగా లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా డప్పు కళాకారులు, చర్మకారులకు సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ సర్టిఫికెట్ తప్పనిసరి చేయడం వల్ల అనేక మంది ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గతంలో మాదిరిగానే వారికి సెల్ఫ్ డిక్లరేషన్ ఆధారంగా పెన్షన్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు.



సెప్టెంబర్ 7న ప్రారంభమైన పెన్షన్ నమోదు ప్రక్రియను సెప్టెంబర్ 16తో ముగించడం సరికాదన్నారు. వరుస సెలవుల కారణంగా లబ్ధిదారులకు తగినంత సమయం ఉండదని, ఇంటి పన్ను రసీదు సహా వివిధ ధ్రువపత్రాలను సమర్పించాల్సి రావడంతో మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అవసరమైన నిబంధనలు మాత్రమే ఉంచి దరఖాస్తు ప్రక్రియను సులభతరం చేయాలని కోరారు. సెప్టెంబర్ నెలాఖరు వరకు పెన్షన్ నమోదు ప్రక్రియను కొనసాగించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించాలని యర్నం సాయికిరణ్ డిమాండ్ చేశారు. అలాగే 50 ఏళ్లు నిండిన బీసీ, ఎస్సీ, మైనారిటీలకు పెన్షన్ ఇస్తామన్న కూటమి ప్రభుత్వం హామీని అమలు చేయాలని కోరారు. లేనిపక్షంలో లబ్ధిదారులతో కలిసి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పులదాసు రమేష్,పోచవరపు వెంకటేశ్వర్లు, దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మీ భూమి -- మీ హక్కు కార్యక్రమం ద్వారా రైతులకు భరోసా..!

## రైతు భూ హక్కులకు ప్రభుత్వ భరోసా..!

**పెదన సెప్టెంబర్ 9(మీ వార్త ప్రతినిధి)**
పెదన మండలం శేరివర్తపల్లి గ్రామంలో నిర్వహించిన "మీ భూమి -- మీ హక్కు" కార్యక్రమంలో ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలను అర్హులైన రైతులకు పంపిణీ చేసిన పెదన శాసనసభ్యులు శ్రీ కాగిత కృష్ణ ప్రసాద్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ కాగిత కృష్ణ ప్రసాద్ గారు మాట్లాడుతూ, రైతులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న భూ హక్కుల సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించడమే "మీ భూమి -- మీ హక్కు" కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. భూమి ఉన్న ప్రతి రైతుకు స్పష్టమైన హక్కు కల్పించడం ద్వారా వారి భవిష్యత్తుకు భరోసా కల్పించాలన్నదే ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలు రైతులకు అందడం ద్వారా వారి భూ హక్కులకు మరింత భద్రత, స్పష్టత లభిస్తుందని అన్నారు. పట్టాదారు పాసు పుస్తకాలు రైతులకు అందుబాటులో ఉండటం వల్ల బ్యాంకుల ద్వారా రుణాలు పొందడం, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను సులభంగా పొందడం వంటి అంశాల్లో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే గారు



వివరించారు. రైతుల ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూ, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. అర్హులైన ప్రతి రైతుకు ఈ కార్యక్రమం ద్వారా న్యాయం జరిగేలా, వారి భూ హక్కులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేలా తన వంతు పూర్తి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే శ్రీ కాగిత కృష్ణ ప్రసాద్ గారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పంచికర్ల సురేష్ గారు మరియు కూటమి నాయకులు కార్యకర్తలు అధికారులు రైతులు గ్రామస్తులు తదితరులు పాల్గున్నారు..

# పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్

### ఫీస్ రియంబర్స్మెంటు బకాయిలను వెంటనే విడుదల చేయాలి

### తహశీల్దార్ కు వినతి పత్రం

### బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు నూనె అనిల్ యాదవ్

**రాయపర్తి** : పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలి అని రాయపర్తి మండల బిజెపి పార్టీ అధ్యక్షులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక తహసిల్దార్ కు ఈ మేరకు వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతీయ జనతాపార్టీ (బీజేపీ ) ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి తెలియ జేయునది 15 వేల కోట్ల రూపాయల స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను చెల్లించకుండా 40లక్షల మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి వెంటనే చెల్లించాలని డిమాండ్ చేయడం జరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరి కారణంగా విద్యార్థులు గత పన్నెండు ఏళ్ళుగా తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు అని, ఉన్నత చదువులు మధ్యలోనే ఆపివేసి డ్రాపౌట్స్ గమిగిలిపోతున్నారని, స్కాలర్షిప్పులు భిక్ష కాదు ప్రభుత్వ బాధ్యత అని గుర్తెరిగి వెంటనే పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని డిమాండ్ చేయడం జరేగింది. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు




# టీడీపీ నాయకులు పెనుమర్తి రామ్ కుమార్ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రోషన్ కుమార్



**జంగారెడ్డిగూడెం ఆగస్టు 9: (మీ వార్త ప్రతినిధి)** జంగారెడ్డిగూడెం టిడిపి సీనియర్ నాయకులు పెనుమర్తి రామ్ కుమార్ పుట్టినరోజు వేడుకలు టీడీపీ నాయకులు కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్తారెడ్డి హాజరై, రామ్ కుమార్ కి శాలువా కప్పి, పూలమాల వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. పర్యావరణాన్ని కాపాడాలనే సందేశంతో పుట్టినరోజు సందర్భంగా ఎమ్మెల్యే రోషన్ కుమార్ మరియు పెనుమర్తి రామ్ కుమార్ కలిసి మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ పుట్టినరోజు, శుభకార్యాల సందర్భంగా తప్పనిసరిగా మొక్కలు నాటాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. గ్రీన్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని, మొక్కలు నాటడం ద్వారా భావి తరాలకు మంచి వాతావరణాన్ని అందించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల, పట్టణ నాయకులు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఘనంగా టీడీపీ నాయకులు తాడి నరసింహారావు పుట్టినరోజు వేడుకలు



**ముమ్మిడివరం సెప్టెంబర్ 9 మీవార్త ప్రతినిధి** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగు దేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తాడి నరసింహరావు పుట్టినరోజు వేడుకలు ఆయన స్వగృహం లో కూటమి నాయకులు అభిమానులు ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా పలువురు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. జనసేన నాయకులు గోదాశి పుండరీష్,బద్రి రమ,గాలిదేవర మూర్తి(బుల్లి) బొక్కా శ్రీను మరియు పలువురు నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో వున్నారు.

# జనసేన నాయకుడు సతీష్ ను పరామర్శించిన గుద్దటి జమ్మి



**ముమ్మిడివరం సెప్టెంబర్ మీవార్త ప్రతినిధి** ముమ్మిడివరం మండలం గేదెల్లంక కు చెందిన జనసేన నాయకులు అప్పారి సతీష్ గత కొంత కాలంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారు.సతీష్ గారిని కలిసి పరామర్శించిన జనసేన నాయకులు గుద్దటి జమ్మి,గోదాసి పుండరీష్ దూడల స్వామి,గుద్దటి విజయ్,బద్రి రమ గాలిదేవర మూర్తి (బుల్లి), రాచకొండ శ్రీను,అయ్యల రమేష్ మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.

# పట్టణంలో ఎమ్మెల్యే రోషన్ కుమార్ ఆధ్వర్యంలో యూనిట్ స్థాయి సమావేశం



**జంగారెడ్డిగూడెం ఆగస్టు 9:(మీ వార్త ప్రతినిధి)** పట్టణ పరిధిలో ఎమ్మెల్యే రోషన్ కుమార్ ఆధ్వర్యంలో టీడీపీ యూనిట్ స్థాయి సమావేశం నిర్వహించారు.జంగారెడ్డిగూడెం పట్టణం నుంచి వచ్చిన ప్రధాన ప్రజా సమస్యలు, పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ--అభివృద్ధి కార్యక్రమాలు, సంస్థాగత అంశాలు, ఓటర్ లిస్ట్‌కు సంబంధించిన విషయాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయడం, పార్టీని మరింత బలోపేతం చేయడం వంటి అంశాలపై నాయకులు, కార్యకర్తలకు శాసనసభ్యులు దిశానిర్దేశం చేశారు,ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్ , ఏలూరు జిల్లా టీడీపీ పార్టీ ప్రధాన కార్యదర్శి జగ్గవరపు ముత్తారెడ్డి , ఏలూరు జిల్లా టీడీపీ పార్టీ ఉపాధ్యక్షులు రావూరి కృష్ణ, పార్టీ సీనియర్ నాయకులు పెనుమర్తి రామకుమార్ ,మరియు యూనిట్ బూత్ క్లస్టర్ ఇన్చార్జులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలకు పోలీస్ శాఖ నుండి అనుమతులు తప్పనిసరి

**తల్లాడ మీ వార్త ప్రతినిధి సెప్టెంబర్ 9**
తల్లాడ మండలం గణేష్ మండపాల నిర్వాహకులకు పోలీసుల కీలక సూచనలు:
తల్లాడ మండల పోలీస్ స్టేషన్ పరిధిలో గణేష్ చతుర్థి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని, మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు ముందస్తు అనుమతులు పొందాలని తల్లాడ ఎస్సై వెంకటేష్ తెలిపారు. ఇటీవల స్థానిక పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి గణేష్ మండపాల ఏర్పాటుకు సంబంధించి నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు శాఖ కేటాయించిన ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా వివరాలను నమోదు చేసుకుని అనుమతి పొందాలి.
విద్యుత్ ప్రమాదాల నివారణ: మండపాల వద్ద నాణ్యమైన విద్యుత్ వైరింగ్ ఉపయోగించి, విద్యుత్ శాఖ అధికారుల అనుమతి తీసుకోవాలి.



శాంతిభద్రతల పరిరక్షణ మండపం వద్ద ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసి, 24 గంటలూ పర్యవేక్షణ ఉండేలా చూసుకోవాలి.
డిజెలకు అనుమతి లేదు: శబ్ద కాలుష్యాన్ని నివారించేందుకు డిజె డీజే) సౌండ్ సిస్టమ్‌లకు అనుమతి లేదని స్పష్టం చేశారు. కేవలం నిర్ణీత పరిమితిలో సౌండ్ బాక్సులను మాత్రమే ఉపయోగించాలి.
అగ్నిమాపక జాగ్రత్తలుఅగ్ని ప్రమాదాలు జరగకుండా మండపాల వద్ద తగినన్ని నీటి సదుపాయాలు మరియు



ఇసుక బకెట్లను సిద్ధంగా ఉంచుకోవాలి.
ట్రాఫిక్ సమసయ్యలు లేకుండా చూడటం: ప్రధాన రహదారులు, రాకపోకలకు అంతరాయం కలగకుండా మండపాలను ఏర్పాటు చేయాలి.శాంతియుత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకోవాలని ఎస్సై వెంకటేష్ వివిధ గ్రామస్తులతో మాట్లాడటం జరిగింది ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శేష్ కుమార్, పిచ్చయ్య ,లక్ష్మణ్, వివిధ గ్రామ ప్రజలందరికీ పలు సూచనలు వివరించారు

# చంద్రబాబు అక్రమ అరెస్ట్ రాష్ట్ర చరిత్రలోనే చీకటి రోజు

**చివరికి నిజమే గెలిచింది ప్రజలు చంద్రబాబు వెంటే నిలిచారు : జమాల్ ఖాన్**

**చింతూరు,సెప్టెంబర్ 9 మీ వార్త ప్రతినిధి :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ రాష్ట్ర చరిత్రలోనే ఒక చీకటి రోజు ని చింతూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మొహమ్మద్ జమాల్ ఖాన్ తీవ్రంగా మండిపడ్డారు.ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ఎంత నిర్బంధించినా చివరికి నిజమే గెలిచిందని అన్నారు.నారా చంద్రబాబు నాయుడు పట్ల




రాష్ట్ర ప్రజలు చూపించిన విశ్వాసం,అభిమానం మరింత బలపడిందని తెలిపారు.ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం పనిచేసే నాయకుడిగా చంద్రబాబు నాయుడు ప్రజలు అండగా నిలిచారని, చివరికి ప్రజల తీర్పుతో తిరుగులేని విజయాన్ని అందించారని జమాల్ ఖాన్ పేర్కొన్నారు.చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# చంద్రబాబు అక్రమ అరెస్టుకు మూడేళ్లు.. కొవ్వొత్తులతో నిరసన

**రాజోలు: సెప్టెంబర్ 9 ( మీ వార్త ప్రతినిధి ):**
తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని అక్రమంగా అరెస్టు చేసి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ర నియోజకవర్గంలో టీడీపీ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొల్లపల్లి అమూల్య ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం శివకోటి గ్రామంలోని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయం వద్ద, శివకోడు లాకులు వద్ద ప్రధాన రహదారిపై కొవ్వొత్తులు వెలిగించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గొల్లపల్లి అమూల్య మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో నారా చంద్రబాబు నాయుడిని అన్యాయంగా, అక్రమంగా అరెస్టు చేసి 53 రోజులపాటు నిర్బంధించారని ఆరోపించారు. ప్రజల కోసం పనిచేసిన నాయకుడిని రాజకీయ కక్షతోనే ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు. చంద్రబాబు అరెస్టు సమయంలో రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ శ్రేణులు, ప్రజలు తీవ్ర ఆవేదనకు గురయ్యారని తెలిపారు. చంద్రబాబు అరెస్టు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా జరిగిందని అమూల్య పేర్కొన్నారు. రాజకీయ నాయకులపై కేసులు,



అరెస్టులు పెట్టడం ద్వారా ప్రజల గొంతును అణచివేయలేరని అన్నారు. చంద్రబాబు నాయుడు ఎప్పుడూ ప్రజా సమస్యల పరిష్కారం, రాష్ట్ర అభివృద్ధి కోసం పోరాడే నాయకుడని తెలిపారు. అరెస్టు జరిగిన రోజులను టీడీపీ శ్రేణులు ఇప్పటికీ మరచిపోలేదని, ఆ సమయంలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తు చేసుకున్నారు. ఆయన ఏ తప్పు చేయలేదు కాబట్టే చివరికి కోర్టు, ఈడి క్లీన్ చీట్ ఇచ్చాయి అని అన్నారు. చంద్రబాబు నాయుడిపై పెట్టిన కేసులు, ఆయన అరెస్టు వ్యవహారంపై టీడీపీ శ్రేణులు తమ నిరసనను కొనసాగిస్తాయని అన్నారు. కొవ్వొత్తుల నిరసన సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు చంద్రబాబు నాయుడికి సంఘీభావం తెలిపారు.



నినాదాలు చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు.
ప్రజాస్వామ్య పరిరక్షణకు టీడీపీ కార్యకర్తలు ఐక్యంగా నిలబడాలని నాయకులు పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ ముదునూరి చిన్నబాబు రాజు, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండల పార్టీ అధ్యక్షులు అనుసూరి సునీత రామ పురుషోత్తం, అడబాల సాయిబాబు, తాడి సత్యనారాయణ, బోళ్ల వెంకటరమణ, కసుకుర్తి త్రినాధ స్వామి, కోటిపల్లి రత్నమాల, ఆరుమల్లి భాను, పప్పుల రమేష్, గోనిపాటి రాజు, కడలి ఏడుకొండలు స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.....

# నాడు 53 రోజులు జైలు... నేడు ప్రజల ఆశీర్వాదంతో ముఖ్యమంత్రి

**ఇదే ప్రజల తీర్పు**

**మచిలీపట్నం సెప్టెంబర్ 9(మీ వార్త ప్రతినిధి)**
బందరు మండలం:బందరు మండలం -- కనూరు పంచాయతీ కార్యాలయం తెలుగుదేశం పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ప్రస్తుత ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారిని 09-09-2023న అప్పటి వైసీపీ ప్రభుత్వం అరెస్టు చేసి 53 రోజుల పాటు జైలులో నిర్బంధించిన ఘటనకు నేటితో మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, బందరు మండలం కనూరు పంచాయతీ కార్యాలయం వద్ద తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ గోపు సత్యనారాయణ గారు మాట్లాడుతూ, చంద్రబాబు నాయుడు గారిని 09-09-2023న అరెస్టు చేసి 53 రోజుల పాటు జైలులో ఉంచినా ఆయన ధైర్యంగా న్యాయపోరాటం చేశారని అన్నారు. ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా ప్రజల కోసం ఆయన చేసిన పోరాటాన్ని ప్రజలు మరచిపోలేదని పేర్కొన్నారు.చంద్రబాబు నాయుడు గారిని అరెస్టు చేసి జైలులో ఉంచినా చివరికి న్యాయమే గెలిచిందని గోపు సత్యనారాయణ గారు అన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు కూటమికి 164 అసెంబ్లీ స్థానాల అఖండ విజయాన్ని అందించి, శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారిని తిరిగి



ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నారని తెలిపారు.నాడు 53 రోజులు జైలులో ఉన్న నాయకుడు... నేడు ప్రజల ఆశీర్వాదంతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని నడిపిస్తున్నారని, ఇది ప్రజాస్వామ్య శక్తికి, ప్రజల తీర్పుకు నిదర్శనమని అన్నారు. అధికారం శాశ్వతం కాదని, ప్రజల తీర్పే అంతిమమని ఈ పరిణామం మరోసారి నిరూపించిందని పేర్కొన్నారు.చంద్రబాబు నాయుడు గారు జైలులో గడిపిన 53 రోజులకు గుర్తుగా 53 కొవ్వొత్తులను వెలిగించి ఆయనకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు గారిపై తమకున్న అభిమానాన్ని, ఆయనకు జరిగిన అన్యాయంపై తమ నిరసనను నాయకులు, కార్యకర్తలు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు,ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
"నాడు జైలు... నేడు ముఖ్యమంత్రి --- ఇదే ప్రజల తీర్పు" అంటూ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు.

## రాజుపాక లో పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ.

**అనంతగిరి,సెప్టెంబర్ 9 ( మీ వార్త ) అనంతగిరి** మండలం రాజుపాక గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన రీ-సర్వే ప్రాజెక్టు ద్వారా మంజూరైన పట్టాదారు పాస్‌పుస్తకాలను గిరిజన లబ్ధిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమానికి జడ్పీటీసీ దీసరి గంగరాజు,ఎంపీటీసీ శెట్టి నీలవేణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.?ఈ సందర్భంగా జడ్పీటీసీ గంగరాజు మాట్లాడుతూ:?రాజుపాక రెవెన్యూ పరిధిలోని 39 మంది గిరిజన లబ్ధిదారులకు పట్టాలు అందడం సంతోషకరమన్నారు.?1970లో సర్వే ద్వారా తోక పట్టాలు ఇచ్చారని,56 ఏళ్లుగా భూ హద్దులపై ఉన్న గందరగోళానికి రీ-సర్వేతో స్పష్టత వచ్చిందన్నారు. భూమి తరతరాలకు జీవనాధారమని,రైతులు తమ భూములను క్రయవిక్రయాలు చేయకుండా కాపాడుకోవాలని సూచించారు.?పట్టాల తయారీలో ఏవైనా అనుమానాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు.?ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు పాంగి రవీంద్ర,సీపీఎం నాయకులు జన్ని సుబ్బారావు,జన్ని గంగరాజు,వార్డు మెంబర్లు,పెసా కమిటీ ప్రతినిధులు,గ్రామ పెద్దలు,గిరిజన లబ్ధిదారులు పాల్గొన్నారు.



## గూడూరు కంచకోడూరు గ్రామంలో "పొలం పిలుస్తోంది"



**గూడూరు సెప్టెంబర్ 9(మీ వార్త ప్రతినిధి)** కంచకోడూరు గ్రామంలో "పొలం పిలుస్తోంది" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు పంటల సాగు, వ్యవసాయ పద్ధతులు, పంట నమోదు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏఓ శివ రామకృష్ణ పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు.

## ఉపాధ్యాయులకు జీతాలు అందక ఇబ్బందులు : ఏపీటీఎఫ్ (1938)

**భీమవరం సెప్టెంబర్ 9 (మీ వార్త ప్రతినిధి)** పెంటపాడు మండలంలోని ఉపాధ్యాయులకు ఆగష్టు-2026 నెలకు గాను ఇంతవరకు జీతాలు అందక ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏపీటీఎఫ్ (1938) పశ్చిమగోదావరి జిల్లా శాఖ అధ్యక్షులు రమణ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ విషయమై పశ్చిమగోదావరి జిల్లా విద్యాశాఖాఅధికారి ఓ వీ ఎస్ అనిల్ కుమార్ కు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (1938) పశ్చిమగోదావరి జిల్లా శాఖ తరపున బుధవారం



వినతిపత్రం అందజేశారు. ప్రతి నెలా 15వ తేదీ నుండి 25వ తేదీలోపు ఉపాధ్యాయుల జీతాల బిల్లులను ఎంఈఓ చేసి రాష్ట్ర సిఎఫ్ ఎం ఎస్ కార్యాలయానికి ఆన్లైన్ లో పంపితే, 1వ తేదీన జీతాలు విడుదల అవుతాయని, అయితే పెంటపాడు మండలంలో ఆగష్టు-2026 నెలకు సంబంధించి ఉపాధ్యాయులకు ఇంతవరకూ జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రతి నెలా మొదటి వారంలో ఇంటి లోన్లు, కారు లోన్లు, బ్యాంకు ఈఎంఐ లు, పిల్లల ఫీజులు మొ॥నవి కట్టాలని, ఇంతవరకు జీతాలు అందకపోవడంతో దాదాపు 160 మంది ఉపాధ్యాయ కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో పడ్డాయని అన్నారు. ఈ విషయమై తదుపరి చర్యల నిమిత్తము పశ్చిమగోదావరి జిల్లా విద్యాశాఖాధికారి ఓ వీ ఎస్ అనిల్ కుమార్ కు బుధవారం వినతిపత్రం అందజేయడం జరిగిందని, వెంటనే డీ ఈ ఓ అనిల్ కుమార్ పెంటపాడు ఎంఈఓ శ్రీనివాసరావు కు ఫోన్ చేసి ఆగష్టు నెల ఉపాధ్యాయుల జీతాల స్టేటస్ పై ఆరా తీయడం జరిగిందని, ప్రస్తుతం ఆగస్ట్-2026 కు సంబంధించి పెంటపాడు మండలం ఉపాధ్యాయుల జీతపు బిల్లు సి ఎఫ్ ఎం ఎస్ లో ఉందని, త్వరలోనే జీతాలు జమ అయ్యే అవకాశం ఉన్నట్టు పెంటపాడు ఎం ఈ ఓ శ్రీనివాసరావు డీ ఈ ఓ అనిల్ కుమార్ కు తెలియజేశారని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (1938) పశ్చిమగోదావరి జిల్లా శాఖ అధ్యక్షులు రమణ మీడియాకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పొన్నమండ నాగరాజు కూడా పాల్గొన్నారు.

## సిఎం చంద్రబాబు నాయుడు ను మర్యాదపూర్వకంగా కలిసిన రాజోలు టీడీపీ ఇంచార్జి గొల్లపల్లి అమూల్య

**అంబాజీపేట సెప్టెంబర్ 09( మీ వార్త విలేఖరి ).** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి గన్నవరం నియోజకవర్గం అంబాజీపేట మండలంలోని మాచవరం గ్రామానికి మీ భూమి మీ హక్కు కార్యక్రమంలో భాగంగా పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ను రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి రాజోలు నియోజకవర్గం ఇన్చార్జ్ శ్రీమతి గొల్లపల్లి అమూల్య మర్యాద పూర్వకంగా కలిశారు.



## దాతృత్వంలో ఎమ్మెల్యే బొలిశెట్టి స్ఫూర్తి : నరిసే సోమేశ్వరరావు

**తండ్రి జ్ఞాపకార్థం మహిళా కళాశాలకు ఆర్ఓ వాటర్ ప్లాంట్ బహూకరణ**

**తాడేపల్లిగూడెం, సెప్టెంబర్ 9 (మీ వార్త ప్రతినిధి)** దానధర్మాలు, దాతృత్వంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తనకు స్ఫూర్తి అని బిజెపి నాయకులు నరిసే సోమేశ్వరరావు అన్నారు.తన తండ్రి కీర్తిశేషులు నరిసే వీర్రాజు జ్ఞాపకార్థం తన తల్లి నరిసే జోగి రత్నంతో కలిసి సుమారు లక్ష రూపాయల విలువైన ఆర్ఓ వాటర్ ప్లాంట్ ను పట్టణంలోని డిఆర్ గోయంక మహిళా జూనియర్, డిగ్రీ కళాశాలకు బహూకరించినట్లు తెలిపారు.బుధవారం సాయంత్రం పారిశ్రామికవేత్త నంద్యాల కృష్ణమూర్తి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈతకోట తాతాజీ చేతుల మీదుగా ఈ ప్లాంట్ ను కళాశాల యాజమాన్యానికి అప్పగించారు.ఈ సందర్భంగా సోమేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ దాతృత్వంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉన్నారని, పి-4 లో భాగంగా దాతలను ప్రోత్సహించి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారని ఆయన స్ఫూర్తితోనే తాను కూడా సమాజం కోసం కొంత వెచ్చించాలని నిర్ణయించుకుని, పేద విద్యార్థులకు ఫీజులు చెల్లించడం, సవిత్రుపేట మున్సిపల్ పాఠశాల అభివృద్ధికి విరాళం ఇవ్వడం, నేడు మహిళా కళాశాలకు వాటర్ ప్లాంట్ బహూకరించడం జరిగిందని తెలిపారు.మనం సమాజానికి సహకరిస్తే దేవుడు మనకు ఏదో ఒక రూపంలో ప్రసాదిస్తాడని, ప్రతి ఒక్కరూ దాతృత్వం చాటుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. ఈ వాటర్ ప్లాంట్ కు ఎల్ఐసి విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు గరికపాటి బాపయ్య శర్మ కూడా రూ.20 వేలు రూపాయలు విరాళంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ముత్తా రామారావు, సుంకవల్లి రామకృష్ణ, ప్రిన్సిపాల్ వెంపరాల గణపతిరామ్, బిజెపి పట్టణ అధ్యక్షులు దువ్వా శ్రీనివాస్, తెదేపా నాయకులు వాడపల్లి సుబ్బరాజు, వాసవి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ గ్రంధి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# దెందులూరు లైబ్రరీ సెంటర్

పత్రికా ప్రకటన

అర్ధరాత్రి మాన్యశ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి అక్రమ నిర్బంధానికి నేటితో మూడేళ్లు!

దెందులూరు గ్రామంలో లైబ్రరీ సెంటర్ వద్ద రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి పెనుబోయిన మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో నిజం గెలిచింది అనే కార్యక్రమం నిర్వహించి 53 దీపాలు వెలిగించడం జరిగింది..

ఈ సందర్భంగా మహేష్ యాదవ్ మాట్లాడుతూ.. మాన్యశ్రీ నారా చంద్రబాబు నాయుడు గారిని అర్ధరాత్రి వేళ అక్రమంగా నిర్బంధించిన ఆ నల్లటి రోజుకు నేటితో మూడేళ్లు పూర్తయ్యాయి. ఆనాడు అధికారంలో ఉన్న జగన్ రెడ్డి ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్ని, పగటి కలలు కంటూ, ఆయనను 53 రోజుల పాటు జైల్లో పెట్టినా "నిప్పుకి చెద పట్టదు" అనే సత్యాన్ని కాలం నిరూపించింది. మచ్చలేని చంద్రుడిలా, సత్యమే జయించి, చంద్రబాబు నాయుడు గారు క్లీన్ చిట్ తో





బయటకు వచ్చి ప్రజల మధ్య సగర్వంగా నిలబడ్డారు. ఆ చీకటి రోజును స్మరించుకుంటూ, అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తూ, ఆనాడు తమ ఇళ్ల వద్ద దీపాలు వెలిగించి, చంద్రబాబు నాయుడు గారికి కొండంత అండగా నిలిచిన తెలుగుజాతి ప్రజలందరికీ మరియు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు మరియు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ప్రజాస్వామ్యం పరిరక్షణ కోసం మీరంతా చూపిన ఐక్యత, మద్దతు ఎప్పటికీ మరువలేనిది. ఈ కార్యక్రమంలో దెందులూరు సొసైటీ అధ్యక్షులు గారపాటి కొండయ్య చౌదరి, గ్రామ పార్టీ అధ్యక్షులు కొర్లిపర్ల భాస్కర్, సీనియర్ నాయకులు ఇప్పిలి వెంకటేశ్వరరావు,నేరుసు మారేశ్వర్ రావు, షేక్ జహీర్, పంది మదన్, దూసరి మహేష్ తెలుగుదేశం పార్టీ నాయకులు జనసేన నాయకులు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు...

# గౌరీదేవిపేట పీహెచ్‌సీలో ఘనంగా పీఎంఎస్ఎంఏ దినోత్సవం

**ఎటపాక, సెప్టెంబర్ 9 మీ వార్త ప్రతినిధి:** గర్భిణీలకు మెరుగైన వైద్యం, సురక్షిత ప్రసవం అందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్' (పీఎంఎస్ఎంఏ) కార్యక్రమాన్ని బుధవారం గౌరీదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మరియు నందిగామ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక వైద్యాధికారులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ దినకర్ నేతృత్వంలో గర్భిణీలకు సమగ్ర వైద్య పరీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా గర్భిణీలకు రక్తపోటు (బీపీ), బరువు, ఎత్తు కొలవడంతో పాటు రక్తహీనత (హీమోగ్లోబిన్), రక్తంలో చక్కెర స్థాయిలు, రక్త వర్గ నిర్ధారణ, హెచ్ఐవీ, హెచ్‌బీఎస్ఏజీ వంటి పలు కీలక రక్త పరీక్షలు పూర్తి చేశారు. తీవ్ర రక్తహీనతతో బాధపడుతున్న వారికి నిబంధనల మేరకు ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్లు ఇవ్వడంతో పాటు, అవసరమైన పోషక ఔషధాలను ఉచితంగా పంపిణీ చేశారు. గర్భధారణ సమయంలో ఆకుకూరలు, పండ్లు, ఐరన్ సమృద్ధిగా ఉండే పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని వైద్యులు వివరించారు. వైద్య పరీక్షల్లో అధిక ముప్పు




(హై-రిస్క్) ఉన్న గర్భిణీలను గుర్తించి, మెరుగైన చికిత్స కోసం వారిని ఏరియా ఆసుపత్రులకు తరలించటం, అత్యవసర ప్రసవ సమయాల్లో రక్తం అవసరమైతే వెంటనే అందించేలా కుటుంబ సభ్యులు ముందుగానే రక్తదాతలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. వైద్యుల సూచనల మేరకు ఖచ్చితమైన వ్యవధిలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేయించుకోవాలని, ఎలాంటి చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆసుపత్రికి రావాలని స్పష్టం చేశారు. ప్రతి నెలా 9వ తేదీన ప్రభుత్వం ఈ పీఎంఎస్ఎంఏ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిర్వహిస్తుందని తెలిపారు. నందిగామ గ్రామంలో మొబైల్ మెడికల్ యూనిట్ డాక్టర్ శ్రీదేవి నేతృత్వంలో సంచార వైద్య సేవలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఆరోగ్య సిబ్బంది బృందం గ్రామీణులకు బీపీ, షుగర్ తదితర సాధారణ ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామ పరిధిలోని గర్భిణీలను ప్రత్యేకంగా పరిశీలించి వైద్య సలహాలు అందించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పిల్లల ఆరోగ్య పరిస్థితులు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణీలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో సత్సంగం -- భజన

**మచిలీపట్నం సెప్టెంబర్ 9(మీ వార్త ప్రతినిధి**

విశ్వ హిందూ పరిషత్ కృష్ణా జిల్లా వారి సహకారంతో సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం రాత్రి 7 గంటలకు సత్సంగం మరియు భజన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో 32 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొని భజనలు, సత్సంగంలో పాల్గొన్నారు. అనంతరం మహిళల కోసం లక్కీ డిప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. లక్కీ డిప్‌లో శ్రీమతి యశోద విజేతగా నిలిచారు.

ఈ సందర్భంగా విశ్వ హిందూ పరిషత్ కృష్ణా జిల్లా అధ్యక్షులు డా. బూరగడ్డ శ్రీనాథ్ అమ్మవారికి సమర్పించిన నూతన వస్త్రాలను లక్కీ డిప్ విజేత శ్రీమతి యశోదకు శ్రీమతి సుభాషిణి చేతుల మీదుగా బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు శ్రీ జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం, శ్రీ వెంకట్రావు, శ్రీ అయ్యప్ప, శ్రీ ప్రశాంత్, శ్రీ ఆంజనేయులు, శ్రీమతి సుభాషిణి, ఆలయ పూజారి శ్రీ శేషు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, ఆలయ కేంద్రంగా నిర్వహించే సత్సంగాలు, భజన కార్యక్రమాలు మహిళలను ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో



భాగస్వాములను చేయడంతో పాటు దైవభక్తి, సాంస్కృతిక చైతన్యం, సామాజిక సమైక్యతను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. విశ్వ హిందూ పరిషత్ కృష్ణా జిల్లా ఆధ్వర్యంలో ఆలయాల్లో ఇటువంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ భక్తులను, ముఖ్యంగా మహిళలను, ధార్మిక మరియు సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడానికి కృషి చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# చంద్రబాబు అక్రమ అరెస్ట్ ...

## చీకటి రోజుకు మూడేళ్ళు పూర్తి





భీమవరం: సెప్టెంబర్ 9: మీ వార్త ప్రతినిధి: గొడ్డలి పార్టీ రాజకీయ కక్ష సాధింపుల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబుని అక్రమ కేసులో నిర్బంధించి అరెస్ట్ చేసి సరిగ్గా నేటికి మూడేళ్లు పూర్తి అయ్యిందని, చీకటి రోజుకు మూడేళ్ళు అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కృష్ణ బలిజ పూసల కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు అన్నారు. భీమవరం టీడీపీ కార్యాలయంలో టీడీపీ నియోజక వర్గ ఇన్ ఛార్జ్ తోట సీతారామలక్ష్మి ఆదేశాల మేరకు బుధవారం టిడిపి పట్టణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ మూడేళ్ల క్రితం చంద్రబాబును అక్రమంగా నిర్బంధించారని, 53 రోజుల పాటు నిజం గెలవాలంటూ చంద్రబాబ్నుకు మద్దతుగా నిలిచారన్నారు. రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ పామర్తి వెంకట్రరామయ్య, రాష్ట్ర సీనియర్ నాయకులు వేంద్ర శ్రీనివాస్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2023 సెప్టెంబర్ 9న చంద్రబాబు నాయుడిని స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్ట్ చేశారని, నేటికి మూడేళ్లు పూర్తయిందని, రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే చంద్రబాబును అక్రమంగా నిర్బంధించారని అన్నారు. టిడిపి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు మద్దుల రాము, చెల్లబోయిన గోవింద్ మాట్లాడుతూ రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని, భీమవరం ఎన్నికల్లో అఖండ విజయం సాధించే విధంగా ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలన్నారు. ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని, ప్రజల్లోకి పథకాల వివరాలను తీసుకుని వెళ్ళాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రెటరీ యలమంచిలి శ్రీనివాస్, మాదాసు కనకదుర్గ, జోగేశ్వరి, ఎండి నౌషాద్, ఎండి షాబు, విజ్జురోతి రాఘవులు, పడమటి సోమేశ్వరరావు, కొండ్రు శ్రీనివాస్, చెరుకు తిరుపతిరావు, ఎండి ఫిరోజ్, మిర్తిపాటి గున్నేశ్వరరావు, మహంతి గణపతి, కొప్పర్తి నాగబాబు, నసీమా బేగం, హైమవతి, చింతాడ శ్రీనివాస్, విజ్జురోతి త్రిమూర్తులు, ఎన్ గంగాధర్ తిలక్, గూడూరు సుబ్బారావు, గూడూరు శ్రీను, ద్వారపూడి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# వెలుగు కార్యాలయానికి కేటాయించిన స్థలం కబ్జా.

**రాటలు పాతి అక్రమ కట్టడాలకు యత్నం అధికారులు స్పందించాలని డిమాండ్.**






**అనంతగిరి,సెప్టెంబర్ 9 ( మీ వార్త )** అల్లూరి జిల్లా అనంతగిరి మండలం టోకూరు పంచాయతీ ములియగూడ సమీపంలో ప్రభుత్వం వెలుగు కార్యాలయానికి కేటాయించిన స్థలం కబ్జా కి గురైంది,గుర్తుతెలియని వ్యక్తులు అక్రమ కట్టడాల కోసం ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నారని వెలుగు సిబ్బంది ఆరోపిస్తున్నారు.ప్రభుత్వం వెలుగు కార్యాలయం కోసం కేటాయించిన స్థలంలో కొందరు రాటాలు పాతి కొలతల కర్రలు పెట్టి అక్రమ కట్టడాలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం అందడంతో వెలుగు సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకొని పరిశీలించారు.తమకు కేటాయించిన స్థలంలో గుర్తుతెలియని వ్యక్తులు హద్దులు,ఏర్పాటు చేసి ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు గుర్తించారు.దీనిపై వెలుగు సిబ్బంది ప్రభుత్వ కార్యాలయానికి కేటాయించిన స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నించడం దారుణమని, రెవెన్యూ అధికారులు,సంబంధిత వెలుగు సిబ్బంది తక్షణమే స్పందించాలని ప్రభుత్వ కార్యాలయానికి కేటాయించిన స్థలాన్ని యథావిధిగా అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు, ఆక్రమణలకు పాల్పడిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# శాస్త్రీయ పద్ధతులతోనే రాగిలో అధిక దిగుబడులు.

**మండల వ్యవసాయ అధికారి రంగారావు.**







**అనంతగిరి,సెప్టెంబర్ 9 ( మీ వార్త )**రాగి పంట సాగులో రైతులు శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని అనంతగిరి మండల వ్యవసాయ అధికారి రంగారావు స్పష్టం చేశారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా బుధవారం అనంతగిరి పంచాయతీతో పాటు,టోకూరు పంచాయతీ పరిధిలోని రాయివలస గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన క్షేత్రస్థాయిలో రాగి పంటలను పరిశీలించి,రైతులకు పలు కీలక సూచనలు చేశారు.సాంప్రదాయ పద్ధతులకు స్వస్తి చెప్పి,ఆధునిక శాస్త్రీయ విధానాలను అవలంబించడం ద్వారా ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు ఆశించిన మేర లాభాలు గడించవచ్చని పేర్కొన్నారు.ముఖ్యంగా రాగి పంటను ఆశించే వివిధ రకాల తెగుళ్ల నివారణపై రైతులకు ప్రాథమిక అవగాహన కల్పించారు.పంట మార్పిడి విధానాలు,విత్తన శు ద్ధి ప్రాధాన్యతను వివరించారు.అదేవిధంగా,పంటకు ప్రధాన శత్రువుగా మారే కలుపు మొక్కల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను,తక్కువ ఖర్చుతో కూడిన కలుపు నివారణ పద్ధతులను రైతులకు ప్రాక్టికల్‌గా చూపించారు.ప్రకృతి వ్యవసాయ పద్ధతులు,సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా భూసారాన్ని కాపాడుకుంటూ నాణ్యమైన దిగుబడిని ఎలా సాధించవచ్చో వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు,సంక్షేమ పథకాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో స్వర్ణగ్రామ ప్రాజెక్టు సిబ్బంది,వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు),స్థానిక రైతులు,మహిళా రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రూ.42 లక్షల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన వలవల బాబ్జి



**తాడేపల్లిగూడెం, సెప్టెంబర్ 9 (మీ వార్త ప్రతినిధి)** తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించామని ఏపి భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్, తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, ముఖ్యమంత్రి చంద్రబాబు చికిత్స కోసం ఇబ్బంది పడుతున్న పేదలను ఆదుకునేందుకు సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నారని అన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో 61 మంది లబ్ధిదారులకు 42,61,894 రూపాయల విలువైన చెక్కులను అందజేసినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీ టైలర్స్ ఫెడరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామి,పట్నాల రాంపండు,దాసరి అప్పన్న, పద్మనాభుని మురళి,దాట్ల జగన్నాథరాజు, శ్రీరాముల విజయలక్ష్మి, తాడేపల్లిగూడెం పట్టణం,,మండలం, పెంటపాడు మండలం క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వలవల బాబ్జి ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంలో నిజం గెలిచింది



**తాడేపల్లిగూడెం, సెప్టెంబర్ 9 (మీ వార్త ప్రతినిధి)** మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును అక్రమంగా అరెస్టు చేసి 53 రోజులు జైల్లో ఉంచి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా తాడేపల్లిగూడెం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో "నిజం గెలిచింది" కార్యక్రమం నిర్వహించారు.ఏపి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల మల్లిఖార్జునరావు (బాబ్జి) ఆధ్వర్యంలో 53 కొవ్వొత్తులతో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ, 74 ఏళ్ల వయసులో, 18 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమన్నారు. ఆ అక్రమ అరెస్టుతో ప్రజల్లో వచ్చిన సానుభూతితోనే కూటమికి ఎప్పుడూ లేని మెజారిటీ వచ్చిందని, వైసీపీ 11 సీట్లకే పరిమితమైందని అన్నారు. చివరకు నిజమే గెలిచిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమం




**పెడన, సెప్టెంబర్ 9:(మీ వార్త ప్రతినిధి)** జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించేందుకు ప్రత్యేక సర్వే నిర్వహించనున్నట్లు వైద్య అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం సెప్టెంబర్ 11 నుంచి 24వ తేదీ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సిబ్బంది ప్రజలను పరిశీలించి కుష్టు వ్యాధి అనుమానితులను గుర్తించనున్నారు. చర్మంపై స్పర్శజ్ఞానం కోల్పోయిన మచ్చలు, మొద్దుబారిన ప్రాంతాలు, నరాల బలహీనత వంటి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి తదుపరి వైద్య పరీక్షల కోసం సంబంధిత ఆరోగ్య కేంద్రాలకు పంపించనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజలు ఆరోగ్య సిబ్బందికి సహకరించి, వ్యాధి లక్షణాలు కనిపిస్తే వాటిని దాచకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కుష్టు వ్యాధిని తొలిదశలో గుర్తించి చికిత్స పొందితే పూర్తిగా నయం చేయవచ్చని వైద్య అధికారులు తెలిపారు.

## నిజం గెలిచింది కార్యక్రమంలో కొవ్వొత్తులతో ప్రదర్శన. టిడిపి

మండల అధ్యక్షుడు సుంకవల్లి సాయి..



**జీలుగుమిల్లి. (మీ వార్త ప్రతినిధి)** మండల కేంద్రంలోని టిడిపి మండల అధ్యక్షుడు సుంకవల్లి సాయి నివాసం వద్ద బుధవారం నిజం గెలిచింది కార్యక్రమం నిర్వహించి కొవ్వొత్తులతో ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు సుంకవల్లి సాయి మాట్లాడుతూ టిడిపి అధినేత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా గ్రామంలో నిజం గెలిచింది కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కొవ్వొత్తులతో నాయకులు కార్యకర్తలతో ప్రదర్శన తెలియజేసినట్లు ఆయన తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కక్షపూరిత రాజకీయాలతో చంద్రబాబుపై మోపిన అక్రమ కేసులు నిలవలేకపోయాయని ప్రజాస్వామ్యంలో ఆఖరికి నిజమే గెలిచిందని అన్నారు.. కొవ్వొత్తులు పట్టుకుని అప్పట్లో జరిగిన అన్యాయాన్ని గుర్తు చేసుకుంటూ ధర్మానికి లభించిన విజయం గా చంద్రబాబు నాయుడు నిలబడ్డారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు గారపాటి శ్రీను. ఏఎంసి డైరెక్టర్ గద్దే సుబ్రమణ్యం. వెలగల అజయ్. ఉండవల్లి రామకృష్ణ. బోలగాని అఖిల్. ఉండవల్లి కిరణ్. పిచ్చుకల శ్రీను. బి వంశీ. సుంకవల్లి రాజేష్ చౌదరి. తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా టీడీపీ నాయకులు క్యాండిల్ ప్రదర్శన



**టీ నరసాపురం, సెప్టెంబర్ 9 ( మీ వార్త విలేఖరి ):** గ్రామంలో మెయిన్ సెంటర్ లో పి ఏ సి ఎస్ చైర్మన్ జోనుబోయిన సోంబాబు అధ్యక్షతన "నిజం గెలిచింది" అంటూ ఘనంగా క్యాండిల్ ప్రదర్శన నిర్వహించారు. గ్రామపంచాయతీ ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని క్యాండిల్స్ వెలిగిస్తూ 53 దీపాలతో ప్రత్యేక సందేశాన్ని ప్రదర్శించారు.
ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొని దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధర్మమే ఎప్పటికీ గెలుస్తుందని నిజం ఎప్పటికైనా బయటకు వస్తుంది అని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ అద్దంకి జగ్గారావు,రైతు సంఘం అధ్యక్షులు కిలారు సాంబశివరావు, టీడీపీ నాయకులు రాచబంటు వేములియ్య, టీడీపీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయోత్సాహాన్ని వ్యక్తం చేశారు..

## వైసీపీ కార్యకర్తల కుటుంబాలకు ఇంచార్జ్ వడ్డీ రఘురాం పరామర్శ



**తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 9 (మీ వార్త ప్రతినిధి)** నియోజకవర్గంలోని పలువురి కార్యకర్తల కుటుంబాలను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తాడేపల్లిగూడెం నియోజకవర్గం ఇంచార్జ్ వడ్డీ రఘురాం నాయుడు బుధవారం పరామర్శించారు. పెంటపాడు మండలం కోరుమిల్లి గ్రామానికి చెందిన ఊదరపల్లి రాజ్ కుమార్ ప్రమాదవసత్తు ఇటీవల మరణించారు. ఆయన కుటుంబ సభ్యులను కలిసి వడ్డీ రఘురాం పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.తాడేపల్లిగూడెం మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన కంకిపాటి జయరాజు ఆకస్మిక మృతి చెందారు. ఈ విషయం తెలిసిన వెంటనే వడ్డీ రఘురాం కార్యకర్తలతో కలిసి జయరాజు ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రూ. 10 వేలు ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు వైసీపీ నేత రఘురాం అందించారు.ఇదే గ్రామానికి చెందిన మద్దిపాటి సత్యనారాయణ గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో ఇంటి వద్దనే ఉంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న వడ్డీ రఘురాం ఆయనను పరామర్శించారు. తనకు అండగా ఉన్నానని భరోసాని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మూడేళ్ల క్రితం ఇదే రోజు నాటి చీకటి రోజులను గుర్తు చేసుకుంటూ...




"నిజం గెలవాలి" కార్యక్రమం

**పెడన సెప్టెంబర్ 9 (మీ వార్త ప్రతినిధి)** మూడేళ్ల క్రితం ఇదే రోజు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారిని అక్రమ కేసులో నిర్బంధించిన నాటి చీకటి రోజులను గుర్తు చేసుకుంటూ పెడన నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన "నిజం గెలవాలి" కార్యక్రమంలో పెడన శాసనసభ్యులు శ్రీ కాగిత కృష్ణ ప్రసాద్ గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు గారు జైలులో గడిపిన 53 రోజుల నిర్బంధానికి గుర్తుగా 53 దీపాలను ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ గారు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వెలిగించారు. మూడేళ్ల క్రితం ఇదే రోజు చంద్రబాబు నాయుడు గారిని అక్రమ కేసులో నిర్బంధించారు. ఆయన నిర్బంధంలో ఉన్న 53 రోజులపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు "నిజం గెలవాలి" అంటూ ఆయనకు అండగా నిలిచారు.అన్ని కష్టాలు, కుట్రలు మరియు అక్రమ కేసులను ధైర్యంగా ఎదుర్కొని చివరకు నిజమే గెలిచింది. చంద్రబాబు నాయుడు గారు నిర్బంధం నుంచి విడుదలయ్యారు. న్యాయస్థానాల్లో కూడా అక్రమ కేసులకు ఎదురుదెబ్బ తగిలింది.సత్యం ఎంతకాలం ఆలస్యమైనా చివరకు విజయం సాధిస్తుందనే సందేశానికి నిదర్శనంగా నిలిచిన ఆ 53 రోజుల పోరాటాన్ని ఈ సందర్భంగా స్మరించుకున్నారు.

## ఫ్రంట్ లైన్ వారియర్స్‌కు ఆత్మీయ సత్కారం.. నూతన వస్త్రాల బహుకరణ



**చింతలపూడి, సెప్టెంబర్ 9 ( మీ వార్త ప్రతినిధి ):** పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమతి చీదరాల దుర్గా పార్వతి మధుబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. చింతలపూడి మండలం, పట్టణ పరిధిలోని యూపీహెచ్సీ, పీహెచ్సీలలో ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న సుమారు 150 మంది ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లను ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా గుర్తిస్తూ వారికి నూతన వస్త్రాలను శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ చేతుల మీదుగా బహుకరించారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ మరియు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమతి చీదరాల దుర్గా పార్వతి పుట్టినరోజు సందర్భంగా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజారోగ్య పరిరక్షణలో ముందుండి సేవలందిస్తున్న ఏఎన్ఎంలు, ఆశా వర్కర్ల సేవలను ఈ సందర్భంగా శాసనసభ్యులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి మండల జనసేన పార్టీ అధ్యక్షులు చీదరాల మధుబాబు, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తాటి అప్పారావు, పట్టణ బీజేపీ పార్టీ అధ్యక్షులు శ్రీమతి కొత్తపల్లి విజయ కుమారి , ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి జగ్గవరపు ముత్తారెడ్డి , మాజీ శాసనసభ్యులు ఘంటా మురళి రామకృష్ణ , లింగపాలెం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు గుత్తా సత్యసాయి వరప్రసాద్ (పెదబాబు) , కూటమి నాయకులు, కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## నిజం గెలిచింది... నీతి నిలిచింది,

గోపి నాగబాబు




**గూడూరు సెప్టెంబర్ 9(మీ వార్త ప్రతినిధి)** చంద్రబాబు గారి అక్రమ అరెస్టుకు మూడేళ్లు – కుట్రపూరితంగా 53 రోజుల నిర్బంధం
నాటి చీకటి రోజుకు నిరసనగా 53 కొవ్వొత్తులు వెలిగించిన గూడూరు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు,,, ఈ సందర్భంగా మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గోపి నాగబాబు మాట్లాడుతూ,,సరిగ్గా మూడేళ్ల క్రితం ఇదే రోజు రాజకీయ దురుద్దేశంతో జగన్ కుట్రపూరితంగా పెట్టించిన తప్పుడు కేసులో చంద్రబాబు గారిని అర్ధరాత్రి వేళ అరెస్టు చేశారు. 53 రోజులు పాటు జైలులో నిర్బంధించారు. నాటి చీకటి రోజును నిరసిస్తూ.. 'నిజం గెలిచింది' నినాదంతో సంఘీభావం తెలిపారు,ఐదు దశాబ్దాల నిస్వార్ధ రాజకీయ విలువల శిఖరం నారా చంద్రబాబునాయుడు గారు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది తెలుగు ప్రజల ఆశీస్సులతో కడిగిన ముత్యములా తప్పుడు కేసుల నుంచి బయటకు వచ్చారని నాగబాబు పేర్కొన్నారు. ప్రజా బలమే తెలుగుదేశం పార్టీకి, చంద్రబాబు గారికి శ్రీరామరక్ష అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పోతన రామోజీ, తోట వేణు, అన్నం హరి రామకృష్ణ, కూనపరెడ్డి పెద్దిరాజులు,ఎన్ ఏ బేగ్, కాట్రగడ్డ రత్నబాబు, కటకం నాగమల్లేశ్వరరావు, బత్తిన వీరబాబు, యర ప్రసాద్, కట్ రెడ్డి నాగ మురళి, పూల నాగరాజు, పాలగాని మహేష్, బాసంశెట్టి విజయ్, బొర్రా నాగరాజు,శ్రీను, గొరిపర్తి రాజబాబు,పోతన రంగా, అట్లూరి శ్రీను, రావి సత్యనారాయణ, బేతల స్వామి, శీలం పవన్ కళ్యాణ్, అలుగు సారథి, దోమతోటి సుధాకర్, డొక్కు బాబురావు, కొలుసు నరసింహారావు, మరియు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## కొండపల్లిలో జాతీయ పోషణ మాసం ప్రారంభం

ఆహారం, ఆరోగ్యంపై అవగాహన కల్పించిన అంగన్వాడీ సిబ్బంది



**ఎటపాక, సెప్టెంబర్ 9 మీ వార్త ప్రతినిధి:** సీడీపీవో పి. అరుణ ఆదేశాల మేరకు ఎటపాక మండలం రాయన్నపేట పంచాయతీ పరిధిలోని కొండపల్లి అంగన్వాడీ కేంద్రాల్లో 9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా "పోషణతో ఆరోగ్యం -- ఆరోగ్యంతో అభివృద్ధి" అనే అంశంపై అవగాహన కల్పించారు. సమతుల్య ఆహారం, ఆరోగ్యకరమైన జీవన విధానం, అంగన్వాడీ కేంద్రాల్లో అందించే వేడి భోజనం, ఐవీఆర్ఎస్ ఫోన్ కాల్స్, ప్రధానమంత్రి మాతృ వందన యోజన తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు కిరణ్‌కుమార్, అంగన్వాడీ కార్యకర్తలు సావిత్రి, వరలక్ష్మి, ఆయా సీతమ్మ, ప్రీ-స్కూల్ తల్లులు పాల్గొన్నారు.

## వాసవి మాతా ఆలయంలో ఉమాచంద్రశేఖర స్వామికి ప్రత్యేక పూజలు



**తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 9 (మీ వార్త ప్రతినిధి)** తాడేపల్లిగూడెం ఏలూరు రోడ్ లో వేంచేసియున్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి పంచాయతన క్షేత్రంలో గల ఉమా చంద్రశేఖరస్వామి కి ఉదయం నుండి ఆలయ పురోహితులు సత్యనారాయణశర్మ చే ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్నేశ్వర పూజ, మహన్యాసం, పంచామృతాలు, పలరసాలు, సుగంధ ద్రవ్యాలు విభూది, గందం తో విశేష అభిషేకములు జరిగినవి. ఈ కార్యక్రమంలో శ్రీ ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి నున్న సుందరం పూర్వాధ్యక్షులు పేరూరి కాశయ్య, ఆలయకార్యదర్శి ఆలపాటి సత్యనారాయణ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సెక్రటరీ మాట్లాడుతూ ఈరోజు చాలా విశేషమైన రోజు బుధవారం మాస శివరాత్రి ఈరోజు ఆపరమశివుని ఎంత ఆరాధిస్తే అంత మంచి ఫలితాలు వస్తాయని మనసులో ఉన్న కోరికలు నెరవేరుతాయని పండితులు చెబుతున్నారు. ఈరోజు దర్శించుకున్న భక్తులందరికీ సకల శుభాలు కలగాలని తెలియజేశారు.

## వాసవి మాతా ఆలయంలో ఉమాచంద్రశేఖర స్వామికి ప్రత్యేక పూజలు



**తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 9 (మీ వార్త ప్రతినిధి)** తాడేపల్లిగూడెం ఏలూరు రోడ్ లో వేంచేసియున్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి పంచాయతన క్షేత్రంలో గల ఉమా చంద్రశేఖరస్వామి కి ఉదయం నుండి ఆలయ పురోహితులు సత్యనారాయణశర్మ చే ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్నేశ్వర పూజ, మహన్యాసం, పంచామృతాలు, పలరసాలు, సుగంధ ద్రవ్యాలు విభూది, గందం తో విశేష అభిషేకములు జరిగినవి. ఈ కార్యక్రమంలో శ్రీ ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి నున్న సుందరం పూర్వాధ్యక్షులు పేరూరి కాశయ్య, ఆలయకార్యదర్శి ఆలపాటి సత్యనారాయణ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సెక్రటరీ మాట్లాడుతూ ఈరోజు చాలా విశేషమైన రోజు బుధవారం మాస శివరాత్రి ఈరోజు ఆపరమశివుని ఎంత ఆరాధిస్తే అంత మంచి ఫలితాలు వస్తాయని మనసులో ఉన్న కోరికలు నెరవేరుతాయని పండితులు చెబుతున్నారు. ఈరోజు దర్శించుకున్న భక్తులందరికీ సకల శుభాలు కలగాలని తెలియజేశారు.

## విద్యుత్, పర్యావరణ అధికారరులతో కమిషనర్ సమీక్ష



**తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 9 (మీ వార్త ప్రతినిధి)** తాడేపల్లిగూడెం పురపాలక సంఘ కమిషనర్ యేసుబాబు తన ఛాంబర్ లో విద్యుత్ మరియు పర్యావరణ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో సహాయ కమిషనర్ భవానీబాబు, విద్యుత్, పర్యావరణ విభాగాల ఇంజనీర్లు, పారిశుధ్య తనిఖీదారులు పాల్గొన్నారు. విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించే సమయంలో కొట్టిన కొమ్మలు, ఆకులు, చెత్తను విద్యుత్ విభాగం వారే సొంత ఖర్చుతో తొలగించాలని కమిషనర్ స్పష్టంగా ఆదేశించారు. రోడ్లపై చెత్త వదిలేయకూడదని తెలిపారు.పట్టణంలో ఎక్కడైనా చెట్లు నరకాల్సి వస్తే లేదా పెద్ద కొమ్మలు తొలగించాల్సి వస్తే ముందుగా కమిషనర్ దృష్టికి తీసుకురావాలని, అనుమతి తీసుకున్న తర్వాతనే నరకాలని ఆదేశించారు. పట్టణ పరిశుభ్రత, ప్రజల భద్రత విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## కనకదుర్గమ్మ ఆలయానికి రూ.10 లక్షల నిధులు



**పెడన, సెప్టెంబర్ 9(మీ వార్త ప్రతినిధి)** పెడన పట్టణం ఒకటో వార్డులోని పైడమ్మ తల్లి కాలనీ సమీపంలో నిర్మిస్తున్న పసుపుకుంకుమ సమేత శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం (కనకదుర్గమ్మ గుడి)కి టీటీడీ శ్రీవాణి ట్రస్టు నిధుల నుంచి తొలి విడతగా రూ.10 లక్షల చెక్కును ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ బుధవారం అందజేశారు. ఆలయ నిర్మాణానికి మొత్తం రూ.20 లక్షలు మంజూరయ్యాయి. ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే అందిస్తున్న సహకారం అభినందనీయమని ధర్మకర్త అమ్మనమంచి శ్రీనివాస్ శర్మ పంతులు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు శ్రీనివాస్ వీణం, కొలుకుల శ్యామసుందరరావు, బొర్రా సాంబయ్య, లలితకుమారి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# చుడండి వై చీఫ్ పేలోస్.......

**పిన్నెంటి రత్తయ్య**
**టీడీపీ సీనియర్ నాయకులు, కృత్తివెన్ను మండలం**

**కృత్తివెన్ను సెప్టెంబర్ 9(మీ వార్త ప్రతినిధి)** చంద్రబాబు నాయుడు గారి వెంట నందమూరి కుటుంబం అంతా ఉంది, నా వెనక నా కుటుంబం అంతా ఉంది అంటే మేము తప్పు చెయ్యము. మా పార్టీ తప్పు చెయ్యదు. క్రమ శిక్షణ అనేది టీడీపీ పార్టీకి ఉన్న సహజ కవచం నా గురించి చాలా కష్టపడుతున్నారు మీరు ఎవరో నాకు తెలియదు పిన్నెంటి రత్తయ్య అంటే ఒక బ్రాండ్ ఒక తెల్లకాగితం మీకు నా గురించి ఎవరో రాంగ్ డైరెక్షన్ ఇచ్చి వుంటారు ముందు అది తెలుసుకోండి లేదంటే కృత్తివెన్ను హెడ్ లో ఉంటాను మీరు వచ్చి తెలుసుకోండి అంతే గాని పకోడి వాగుడు వాడకండి సభ్యత సంస్కారంగురించి మాట్లాడుతున్నారు ముందు మీకు సభ్యత సంస్కారం ఉందా ఉంటే ఆనాడు చంద్రబాబు గారు ఇంటి మీద దాడి చేస్తారా ఇప్పుడు చెయ్యగలరా మరి మీ గొడ్డలి పార్టీలో మీ అధినేత అవినీతి కేసుల్లో 16 నెలలు జైల్లో ఉన్నప్పుడు, సొంత చెల్లెలు వై ఎస్ షర్మిల పార్టీ బాధ్యతలు భుజాన వేసుకుని కుటుంబాన్ని సైతం విడిచి పాదయాత్ర చేసింది. యిప్పుడు అదే షర్మిల 2024 ఎన్నికల్లో మా దున్నకు ఓటు వేయొద్దని ప్రచారం చేసింది అంటే కారణం మీ పార్టీలోని బీజ్జల గ్యాంగ్ షర్మిల కట్టుకున్న చీర గురించి, వ్యక్తిగత జీవితం గురించి ఎంతనీచమైన పోస్టులు పెట్టించారు. శ్రీ రెడ్డి, పంచ్ ప్రభాకర్ లాంటి వాళ్ళతో ఎంత దారుణంగా తిట్టించారు.
2019 ఎన్నికల్లో తండ్రి లేని బిడ్డకు ఓటు వేసి గెలిపించాలని ప్రచారం చేసిన వై ఎస్ విజయమ్మ, 2024 ఎన్నికల్లో ఎక్కడ ఉంది, నా పుత్రరత్నానికి ఓటు పడకూడదు, కనీసం ప్రతి పక్ష హోదా రాకూడదు అని ప్రార్ధన చేశాను అంది.
వై ఎస్ సునీత కూడా మా దున్నకు ఓటు వేయొద్దు, మా నాన్న వై ఎస్ వివేకానంద రెడ్డి ని చంపిన వాళ్ళను కాపాడుతున్నాడు మా దున్న వాడికి ఓట్లు వేయొద్దు అని ప్రచారం చేసింది......
యిక ఏ 1 తో 16 నెలలు జైల్లో కలిసి ఉన్న ఏ 2 సాయి రెడ్డి సైతం 11 రెడ్డి జీవితంలో అధికారంలోకి రాడు అని చెబుతున్నాడు అంటే మీ పార్టీ బ్రతుకు అర్థం అవుతుంది, అయిన అది మీ పార్టీ కాదు శివ కుమార్ కూ మీరు నమ్మక ద్రోహం చేసి లాక్కున్న పార్టీ, మీ బదులు ఏ 2 సాయి రెడ్డినే మెరుగు సొంతంగా పార్టీ పెట్టుకుంటున్నాడు. మీ బ్రతుక్కి అదికూడా లేదు. ఎవడో పెట్టిన పార్టీని లాక్కుని వాడిని తన్ని తరిమెసి మీది అంటున్నారు. యిక పెన్షన్ లు మీరు యిచ్చామని చెప్పుకుంటున్న 66 లక్షలు లో సింహాభాగం మీ పెటియం బ్యాచ్ కూ యిలాంటి ఫెక్ పోస్టులు, పేక్ కామెంట్స్ పెట్టడానికి అనేది రాష్ట్ర ప్రజలు అందరికి తెలుసు....అయిదేళ్ళు అధికారంలో ఉండగా ఒక్క డి ఎస్ స్సి పోస్టు వదలని మీరు మెగా డి ఎస్ స్సి గురుంచి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉంది....... పెటియం ముష్టి 5 రూపాయలు కోసం నా జోలికి వస్తే మీ ఖైదీ నెంబర్ 6093 మాట్లాడిన అనేక ఆణిముత్యాలు, వరుసగా వదులుతాను అందులో అస్సలు తగ్గేది లేదు మీ ఉడతా ఊపులకి బెదిరేది లేదు.మీరు జాగ్రత్తగా ఉంటే మంచిది.....వార్డు మెంబెర్, ఎంపీటీసీ కాదు ప్రత్యక్ష రాజకీయాల్లో దిగమని మా నాయకుడు ఏం ఎల్ ఏ కాగిత కృష్ణా ప్రసాద్ ఆదేశిస్తే రిజర్వేషన్ ఎంపీపీ కీ వచ్చిన జడ్పీటీసీ కీ వచ్చిన పోటీకి దిగడమే కాదు, మీ క్యాండెట్ లకు డిపాజిట్ రానివ్వకుండా ప్రజల ఆశీస్సులతో గెలిచి మీకు గుణపాఠం చెబుతాను, పోటీ చేయకున్నా కృత్తివెన్ను మండలంలో ఒక్క ఎంపీటీసీ కూడా మీకు రానివ్వకుండా క్లిన్ స్వీప్ చేసి ఎంపీపీ, జడ్పీటీసీ లతో సహా మా నాయకుడు కాగిత కృష్ణా ప్రసాద్ కూ బహుమతి యివ్వడంలో క్షేత్ర స్థాయిలో ప్రజల మన్ననలు పొందేలా ప్రచారం చేస్తాను......మీరు కులం చూడకుండా, మతం చూడకుండా మీ గొడ్డలి పార్టీ అధ్యక్షుడు జేబులో



డబ్బులు యివ్వలేదు, ప్రజల పన్నుల సొమ్మును అభివృద్ధి చెయ్యకుండా పది రూపాయలు మింగి పావలా, అర్ధ రూపాయి ప్రజలకు జల్లి అంగన్వాడీ లో పిల్లల కోసం తెచ్చిన పాల ప్యాకెట్లతో మీ నాయకులకు అభిషేకాలు చెయ్యడం రాష్ట్ర ప్రజలు అందరు చూసారు.... ఇంకా చెప్పాలి అంటే ప్రజా ధనం ను మా అమ్మకం నువ్వే 11 రెడ్డి అంటూ పోస్టర్లు వేసి ఇళ్లకు దిష్టి బొమ్మలు మాదిరి తగిలించారు, సమాధుల మీదా ఫోటోలు వేసుకున్నట్టు సరి హద్దు రాళ్ల మీదా మీ దిష్టి బొమ్మలు చెక్కారు, ప్రభుత్వ కార్యాలయాలకు పిచ్చి బులుగు రంగులు వేశారు. 5 ఏళ్లలో ప్రజాధనం కోట్లాది రూపాయలు తాడేపల్లి కొంపలో ఎగ్ పప్పుల రూపంలో మింగేసారు....

## ఘనంగా టీడీపీ నాయకులు తాడి నరసింహారావు జన్మదిన వేడుకలు




**ముమ్మిడివరం, సెప్టెంబర్ 9 ( మీ వార్త విలేఖరి ):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తాడి నరసింహారావు జన్మదిన వేడుకలు మమ్మిడివరంలో టీడీపీ, బిజెపి, జనసేన నాయకులు తో పాటు అయన అభిమానులు, మిత్రులు ,ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా కేక్ కట్ చేయించి అయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసారు . ఈ జన్మదినం వేడుకల్లో పూర్వం తనతో పాటు విజ్జభ్యసం అభ్యర్థించిన పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు కూడా నరసింహారావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జంగారెడ్డి రమేష్, పి టి వి వర్మ కదలి నాగు, మట్టపర్తి సురేష్ సణ్ముఖ, అసుబాబు, కామాడి గంగాధర్, కదలి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు ముందస్తు ప్రణాళికతో సిద్ధం కండి: కలెక్టర్ నాగరాణి



**భీమవరం: సెప్టెంబర్ 9: మీ వార్త ప్రతినిధి:** జిల్లాలో త్వరలో జరగనున్న మున్సిపల్, పంచాయతీరాజ్ స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు ముందస్తు ప్రణాళికతో సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి పటాలు రూపొందించాలని, రహదారులు, రవాణా, భద్రతా ఏర్పాట్లను సమీక్షించాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులను గుర్తించి నిబంధనల మేరకు బైండోవర్ చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మీ మాట్లాడుతూ సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, ఎన్నికల నియమావళి ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు వేసేలా భద్రత కల్పిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ, డీఆర్వో పి. గ్లోరియా, ఆర్డీవోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎన్నికల అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అంజిబాబు



**భీమవరం ; సెప్టెంబర్ 9 మీ వార్తా జిల్లా ప్రతినిధి.** తాడేపల్లి అన్నపూర్ణ కన్వెన్షన్ హాల్లో బుధవారం జనసేన స్థానిక సంస్థల ఎన్నికల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ఎన్నికల అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## టీడీపీ కార్యాలయం వద్ద 'నిజం గెలిచింది'

**53 కొవ్వొత్తులతో నిరసన షరీఫ్ రామరాజు భూపతి నరేష్**




**నరసాపురం సెప్టెంబర్ 9 మీ వార్తా జిల్లా ప్రతినిధి.** నాలుగున్నర దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన నారా చంద్రబాబు నాయుడు పై నాటి వైసీపీ ప్రభుత్వం ఎటువంటి ఆధారాలు లేకుండా స్కిల్ డెవలప్మెంట్ పేరుతో అక్రమ కేసులు బనాయించి అన్యాయంగా అరెస్ట్ చేసి నేటికి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా నర్సాపురం నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇంచార్జ్ పోత్తూరి రామరాజు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పార్టీ కార్యాలయం వద్ద 'నిజం గెలిచింది' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ శాసనమండలి సభ్యులు ఎంఏ షరీఫ్ పాల్గొన్నారు ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ ఈ రోజు రాష్ట్ర రాజకీయ చరిత్రలోనే ఒక చీకటి రోజని, చంద్రబాబు ని అక్రమంగా 53 రోజులు రాజమండ్రి సెంట్రల్ జైలులో పెట్టి వేధించినందుకు నిరసనగా నాయకులు 53 కొవ్వొత్తులను వెలిగించి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఎంఏ షరీఫ్ మాట్లాడుతూ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా పెట్టిన అక్రమ కేసులను న్యాయస్థానాలు కొట్టివేసి చంద్రబాబు కు క్లీన్ చిట్ ఇవ్వడం ద్వారా నిజాయితీయే గెలిచిందని స్పష్టం చేశారు. పశ్చిమగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి భూపతి నరేష్ మాట్లాడుతూ అక్రమ కేసులతో ప్రజాబలాన్ని అణచివేయాలని చూసిన జగన్మోహన్ రెడ్డిని 2024 ఎన్నికల్లో ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసినా, ఆయన వైఖరి మారలేదని, డీఎస్సీ, అమరావతి, పోలవరం వంటి ప్రాజెక్టులను అడ్డుకుంటూ సోషల్ మీడియాలో ఫేక్ ప్రచారాలు చేస్తున్నారని భూపతి నరేష్ మండిపడ్డారు. ప్రజాదరణ పొందుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పశ్చిమగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి భూపతి నరేష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మావుళ్లమ్మ స్వర్ణమయం ప్రాజెక్టుకు భక్తుల విరాళాలు



**భీమవరం: సెప్టెంబర్ 9: మీ వార్త ప్రతినిధి:** భీమవరం పట్టణంలోని ప్రముఖ ఇలవేల్పు, ఆరాధ్యదైవం శ్రీ మావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానంలో సంపూర్ణ స్వర్ణమయం ప్రాజెక్టు కోసం ఏర్పాటు చేసిన హుండీని దేవదాయ, ధర్మదాయ శాఖ ఆదేశాల మేరకు బుధవారం తెరిచి లెక్కించారు. దేవస్థానం సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్, దేవదాయ శాఖ భీమవరం తనిఖీదారు పి.ఎస్. సాయికుమారి పర్యవేక్షణలో హుండీ లెక్కింపు చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులు హుండీలో రూ.3,02,696 నగదు, 16 గ్రాముల 700 మిల్లీగ్రాముల బంగారం సమర్పించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్, చైర్మన్ బొండాడ నాగభూషణం, ధర్మకర్తలు రామాయణం శ్రీనివాస్, ఉదిశి మీనాక్షి, అతికెల ఆంజనేయ ప్రసాద్, పాపోలు ఏడుకొండలు, స్వర్ణ వస్త్రం ప్రాజెక్టు సభ్యులు గోంట్ల వెంకట నారాయణ, కాగిత వెంకట రమణతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

## చించినాడ బ్రిడ్జిపై వరుస విషాదాల నేపథ్యంలో మంత్రి నిమ్మల రామానాయుడు







**పాలకొల్లు : సెప్టెంబర్ 9 మీ వార్తా జిల్లా ప్రతినిధి.** క్షేత్రస్థాయి పరిశీలన.నేషనల్ హైవే, ఆర్ అండ్ బి, ఇరిగేషన్ హెడ్ వర్క్స్ అధికారులతో కలిసి చించినాడ బ్రిడ్జిని పరిశీలించిన మంత్రి నిమ్మల. చించినాడ బ్రిడ్జికి ఇరువైపులా, 2.4 కిలోమీటర్ల పొడవునా రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించిన మంత్రి నిమ్మల.
వరుస ఆత్మహత్యలతో చించినాడ బ్రిడ్జి పై ఇరువైపులా ఫెన్సింగ్ ఏర్పాటుకు అంచనాలను రూపొందించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించిన మంత్రి నిమ్మల. నేషనల్ హైవే అథారిటీకి, పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ పలు లేఖలు కూడా రాయడం జరిగింది. బ్రిడ్జి పై ఫెన్సింగ్ కు పలు డిజైన్స్ పరిశీలించిన మంత్రి నిమ్మల. ఎంత ఖర్చు అయినా, విషాదాలకు అవకాశం లేకుండా, గోదావరి అందాలకు అడ్డు రాకుండా నిర్మాణం ఉండాలి. నేషనల్ హైవే అథారిటీ రీజనల్ మేనేజర్ ఆర్కే సింగ్ తో నేరుగా మాట్లాడి, పనులకు నిధులు మంజూరు చేసి వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించిన మంత్రి చించినాడ బ్రిడ్జిపై ఇరువైపులా తొమ్మిది మీటర్లు ఎత్తులో 116 లైటింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించడం జరిగింది.
అప్పులు, ఆర్థిక ఇబ్బందులు, కష్టాలు జీవితంలో తాత్కాలికమే కానీ, ప్రాణం అమూల్యం. సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదు, ధైర్యంగా ఎదుర్కొంటే ప్రతి సమస్యకు మార్గం ఉంటుంది. గోదావరిలో దూకి ప్రాణాలు తీసుకోవద్దు, మీపై ఆధారపడిన కుటుంబం, పిల్లలు, బంధువులు గురించి ఆలోచించాలన్న మంత్రి నిమ్మల రామ నాయుడు,

## నిత్యావసర ధరలు తగ్గించాలి: సీపీఐ



**భీమవరం: సెప్టెంబర్ 9: మీ వార్త ప్రతినిధి:** నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో పేదలు, కార్మికులు, రైతులు, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమరావు అన్నారు. ధరలను నియంత్రించడంతో పాటు నల్లబజారు, దళారీ వ్యవస్థను అరికట్టాలని డిమాండ్ చేస్తూ బుధవారం భీమవరంలో సీపీఐ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ కె. నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, బియ్యం, పప్పులు, కూరగాయల ధరలను వెంటనే నియంత్రించాలని భీమరావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు చెల్లబోయిన రంగారావు, ఎం. సీతారాంప్రసాద్, కిలారి మల్లేశ్వరరావు, వై.వి. ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

Edited Printed Published & Owned by U. SHEKHAR. And Printed at Mani Raghava Printers, #A-20, Vambay Colony, Hyderabad, Rajendranagar, Rangareddy, Telangana.
Published at Manikanta Publications, H.No. 3-67/3/66, Netaji Nagar, Nallagandla, Serilingampally, Rangareddy (Dist), Telangana, EDITOR U.SHEKHAR, RNI. NO. TEL/2018/77112